veluturu telugu daily
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి నల్గొండ మంగళవారం 20.10.2026
సంపుటి : 9 సంచిక : 128
www. veluturu.com

వెలుతురు దినపత్రిక పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
**విజయదశమి శుభాకాంక్షలు**
మంగళవారం మా కార్యాలయానికి సెలవు.. కావున బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం..



## ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ

- ఆరుగురు మంత్రులతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర సమీక్షలు
- జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను సిఫారసు చేసేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చైర్మన్‌గా వ్యవహరించే ఈ కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి సీతక్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి

- మిగతా 2 లో..

## నౌకాదళంలో ఆధునిక సాంకేతిక విప్లవం

2

- ఏఐ నుంచి క్వాంటమ్ టెక్నాలజీ వరకు మరింత శక్తిమంతంగా..
- డ్రోన్ సామర్థ్యాల అభివృద్ధిపై దృష్టి
- వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్





అత్యంత పకడ్బందీగా

# శాంతి భద్రతల పర్యవేక్షణ

### ఫ్యూచర్ సిటీ నూతన పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

- వేదమంత్రాల నడుమ ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషిని కుర్చీలో కూర్చోబెట్టిన సీఎం
- పుష్పగుచ్ఛం అందించి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్టత దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం కేంద్రంగా ఏర్పాటైన ఈ నూతన కమిషనరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

ఈ ప్రారంభ వేడుకలో భాగంగా నూతన పోలీస్ కమిషనర్‌గా నియమితులైన తరుణ్ జోషిని వేదమంత్రాల ఉచ్చారణ మధ్య అధికారులు ప్రత్యేక కుర్చీలో ఆసీనులను చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సీపీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, భవిష్యత్తులో అక్కడ జరగబోయే వేగవంతమైన పారిశ్రామిక, పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. రద్దీ పెరిగే ప్రాంతాల్లో శాంతిభద్రతల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేలా ముందుచూపుతో ఈ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో విద్య, ఉపాధి రంగాలతో పాటు నివాస వసతులు కూడా వేగంగా విస్తరిస్తుండటంతో, స్థానిక ప్రజలకు మెరుగైన భద్రత అందించేందుకు ఈ పోలీసు యంత్రాంగం ఎంతో దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లుండాలి

- స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి
- నవంబరు నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలి
- ఫ్యూచర్ సిటీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



## చెడుపై మంచి గెలుపే విజయదశమి

ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు

2

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఖరారు

ఖమ్మం-వరంగల్-నల్గొండ ఎమ్మెల్సీ స్థానానికి పింగళి భిక్షం గౌడ్

# దేశంలో నిశ్శబ్ద విప్లవం




- కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజామద్దతు
- రాహుల్ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
- బీజేపీకి ప్రత్యామ్నాయంవైపు చూస్తున్న ప్రజలు
- కష్టకాలంలో నిలిచిన కార్యకర్తలకు మరింత గుర్తింపు ఇవ్వాలని సూచన
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 19:**

రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విప్లవం సాగుతోందని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయం వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. రాహుల్, కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజామద్దతు జాతీయ స్థాయిలో రాజకీయ మార్పు పట్ల ప్రజల్లో ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. చార్మినార్ వద్ద సోమవారం నిర్వహించిన రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం, రాజీవ్ సద్భావన పురస్కార ప్రదానోత్సవానికి ఉత్తమ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు రాహుల్ సమర్థ నాయకత్వాన్ని అందించారని చెప్పారు. దేశవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగడం రాజకీయ మార్పునకు సంకేతమన్నారు. బీజేపీని ఓడించి, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యతను బలోపేతం చేసే పోరాటంలో కార్యకర్తలు రాహుల్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మతసామరస్యం, జాతీయ సమైక్యత సందేశంతో రాజీవ్‌గాంధీ చేపట్టిన సద్భావన యాత్రను స్మరించుకుంటూ 1990 నుంచి ఏటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, రాజీవ్ సద్భావన పురస్కార కమిటీని ఉత్తమ్ అభినందించారు. పదవులతో నిమిత్తం లేకుండా

- మిగతా 2 లో..

# మెటా అల్గారిథమ్‌పై కేంద్రం నిఘా

2

- కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కీలక సూచనలు
- తప్పుడు లేదా పాత కంటెంట్ వ్యాప్తిని నియంత్రించాలని విజ్ఞప్తి

## కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు

- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్, మంత్రి పొంగులేటి, గడ్డం వంశీకృష్ణలకు నోటీసులు
- కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం
- సోషల్ మీడియా పోస్టులను బేషరతుగా తొలగించి, తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠను దెబ్బతీసేలా, కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించారు. ఇదే అంశంపై ఇప్పటికే వెలుగు దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్న ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు పంపించారు. తమ సోషల్ మీడియా

- మిగతా 2 లో..

## ఫ్రాన్స్ నుంచి అమెరికా వరకు
# ప్రజాగ్రహ జ్వాలలు!

- ధరల భారం.. విద్యా సంక్షోభం..
- నిరుద్యోగంపై రగులుతున్న యువత
- ఫ్రాన్స్‌లో విధ్వంసం.. అల్జీరియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం
- అమెరికాలో 'నో కింగ్స్' నినాదం..
- అర్జెంటీనాలో విద్యార్థుల పోరు
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అసంతృప్తి

- వివరాలు 11 లో..

### 8 దేశాల్లో నిరసనల సెగ..

హింసాత్మకంగా మారుతున్న ఆందోళనలు





# చెడుపై ఎప్పటికైనా విజయం 'మంచి'కే..

## విజయ దశమి పర్వదినమే నిదర్శనం

- చెడు చేసే వాళ్లు ప్రవర్తన మార్చుకుని పరులకు సేవ చేస్తేనే అమ్మవారి కరుణాకటాక్షాలుంటాయి
- గతం కంటే ఎక్కువగా ఈసారి దేవీ నవరాత్రి ఉత్సవాలు జరిగాయి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్





**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 19:**

చెడు చేసే వారికి ఎన్నటికీ విజయం వరించదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నటికైనా చెడుపై విజయం సాధించేది 'మంచి' మాత్రమేనని పునరుద్ఘాటించారు. పొరపాటున చెడు చేసే వారు ఇకనైనా ప్రవర్తనను మార్చుకుని ఇతరులకు సేవ చేయాలని, అలాంటి వారిపట్ల మాత్రమే అమ్మవారి కరుణా కటాక్షం ఉంటుందని చెప్పారు. మహిషాశుర మర్ధిని చరిత్ర కూడా అదే చెబుతుందని తెలిపారు. దేవీ నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన సోమవారం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో అమ్మవారు మహిషాశుర వర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో 'చండీ యాగం' పేరిట నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. అనంతరం భవానీ దీక్షను విరమించారు. సాయంత్రం 7.30 గంటలకు మహాశక్తి ఆలయంలో నిర్వహించిన రావణ దహనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. "హిందు బంధువులందరికీ విజయ దశమి శుభాకాంక్షలు. దేశవ్యాప్తంగా, తెలంగాణ, తెలుగు రాష్ట్రాల్లో గల్లీగల్లీలో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకున్నాం. చిన్ని పిల్లలు సైతం అమ్మవారికి పూజలు చేశారు. కరీంనగర్ మహాశక్తి ఆలయంలో దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు దీక్షలు ఇక్కడే చేపట్టారు. అమ్మవారిని మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఏర్పడింది. దేశంలోనే కాదు, విదేశాల్లోని తెలుగు కుటుంబాలు సైతం పెద్ద ఎత్తున దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయ దశమి పర్వదినంగా జరుపుకుంటున్నాం. పొరపాటున చెడు చేస్తే ప్రవర్తన మార్చుకుని ఇతరులకు సేవ చేస్తే అమ్మవారి కరుణా కటాక్షం ఉంటుంది. చెడు ఎప్పుడు విజయం సాధించదు. అధర్మానికి చోటు లేదు. మహిషాశుర మర్ధిని చరిత్ర కూడా అదే చెబుతుంది.

## ఖమ్మం-వరంగల్-నల్గొండ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థి ఖరారు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 19:**

తెలంగాణలో జరగనున్న ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి బీజేపీ తన అభ్యర్థిని దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగళి భిక్షం గౌడ్‌ను బరిలోకి దించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఇటీవల పీఆర్‌టీయూ సీనియర్ నేతలు ఢిల్లీతో పాటు రాష్ట్రస్థాయిలోని బీజేపీ ముఖ్య నేతలతో చర్చలు జరిపారు. ఈ నెలాఖరులో ప్రభుత్వ సర్వీస్ నుంచి పదవీ విరమణ చేయనున్న భిక్షం గౌడ్, ఆ తర్వాత పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల్లో పీఆర్‌టీయూకు ఉన్న బలమైన నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ స్థానంలో గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవాలని బీజేపీ భావిస్తోంది.



## నౌకాదళంలో ఆధునిక సాంకేతిక విప్లవం

- ఏఐ నుంచి క్వాంటమ్ టెక్నాలజీ వరకు మరింత శక్తిమంతంగా..
- డ్రోన్ సామర్థ్యాల అభివృద్ధిపై దృష్టి : వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 19:**

సముద్ర భద్రత విషయంలో రోజురోజుకూ ముంచుకొస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి భారత నేవీ సరికొత్త సాంకేతికతల అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. గగనతలం, సముద్రం, నీటి అడుగున సైనిక కార్యకలాపాలతో పాటు ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ వంటి రంగాల్లో సామర్థ్యాల్ని పెంచుకుంటోంది. ఈ మేరకు భారత నౌకాదళాన్ని అన్ని రంగాల్లో అత్యాధునిక శక్తులు కలిగిన మల్టీ డొమైన్ నెట్‌వర్క్ ఫోర్స్‌గా మార్చడమే లక్ష్యమని ఇండియన్ నేవీ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ తెలిపారు. సోమవారం రోజు దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. నేవీ ఫోర్స్‌లో కొత్త సాంకేతికల్ని అందిపుచ్చుకోవడమే కాకుండా, వాటిని సైనిక కార్యకలాపాల్లో ఉపయోగపడేలా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

కొంత కాలంగా అంతర్జాతీయంగా కొనసాగుతున్న యుద్ధాలు, సంఘర్షణలు సైనిక కార్యకలాపాల్లో సాంకేతికత ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేశాయని కొచ్చర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఆటోమేటెడ్ సిస్టమ్స్ (స్వయంచాలక వ్యవస్థలు), కృత్రిమ మేధ వంటి సాంకేతికతలను యుద్ధ కార్యకలాపాల్లో వినియోగించుకోవాల్సిన అవసరం పెరుగుతోందని వివరించారు. అందుకే భవిష్యత్ అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని కౌంటర్- యూఏఎస్ (అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్) సామర్థ్యాలు, క్వాంటమ్ టెక్నాలజీ వినియోగంపైనా నేవీ దృష్టి సారిస్తోందని తెలిపారు.

# చెడుపై మంచి గెలుపే విజయదశమి

## ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని అన్నారు.

ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తుచేస్తుందన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటిచెబుతుందని అన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లుండాలి

- స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి
- నవంబరు నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలి
- ఫ్యూచర్ సిటీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు పదిహేను రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబరు నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. కానుంది. 'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ప్రాంగణంలో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సమ్మిట్ ఏర్పాట్లపై కసరత్తు చేయాలన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఆ స్థాయిలో సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు.

బహిరంగ ప్రాంగణ పనులను నవంబరు 15లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని సీఎం అన్నారు. అందుకే సమ్మిట్ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు ఒక కమిటీని నియమించుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

## ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి, సంబంధిత శాఖలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు తదుపరి చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. మంత్రివర్గ ఉపసంఘం ప్రత్యేక ఆహ్వానితుడిగా సీఎం సలహాదారు రామకృష్ణారావును నియమించారు. దీనికి కన్వీనర్‌గా ప్రణాళిక శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు.

### తాగునీటి సమస్యలు తలెత్తకుండా..

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మంత్రి సీతక్క అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరా, నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తాగునీటి భద్రతతో పాటు జల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కీలకంగా వ్యవహరిస్తోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు, పంట గుంతలు, ఊట కుంటల నిర్మాణం, నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తోంది. నీటి వనరులను సంరక్షించడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భవిష్యత్తులో తాగునీటి కొరతను తగ్గించేందుకు చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వేసవికి ముందే నీటి సమస్యలను గుర్తించి పరిష్కరించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడటంలో శాఖ సమన్వయంతో పనిచేస్తోంది.

## మెటా అల్గారిథమ్పై కేంద్రం నిఘా



- కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కీలక సూచనలు
- తప్పుడు లేదా పాత కంటెంట్ వ్యాప్తిని నియంత్రించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వార్తలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని వినియోగదారులకు చూపించే విధానంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా ప్లాట్‌ఫారమ్‌లపై కేంద్ర ప్రభుత్వం గట్టి నిఘా పెట్టింది. తమ సోషల్ మీడియా రికమెండేషన్ సిస్టమ్స్ (కంటెంట్‌ను సిఫార్సు చేసే విధానాలు) వినియోగదారులకు కేవలం ఒకే రకమైన లేదా పరిమితిమైన కథనాల్ని మాత్రమే ఎక్కువగా కనిపించేలా ప్రదర్శించకూడదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక్కడ ఒకే తరహా కథనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అదే విధంగా శాంతి భద్రతలకు భంగం కలిగించే, హింసను ప్రేరేపించేలా లేదా ప్రజల్లో గందరగోళం సృష్టించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దారితీసేలా ఉండే కంటెంట్‌పై పర్యవేక్షణ మరింత పెంచాలని కోరింది. ఈ మేరకు అక్టోబర్ 10న మెటాకు అధికారికంగా ఒక అడ్వైజరీని జారీ చేసింది. ఫొటోలు, వీడియోలు, గ్రాఫిక్స్ వంటి సమాచారాన్ని చూపేటప్పుడు వాటి నేపథ్యాన్ని కూడా వివరించాలని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ముఖ్యంగా ఒక వీడియో లేదా ఫొటో ఎప్పుడు, ఎక్కడ చిత్రీకరించారో లేదా దాని వెనుక ఉన్న పరిస్థితులేమిటో వినియోగదారులకు స్పష్టంగా తెలియని సందర్భాల్లో పూర్తి వివరాల్ని అందించాలని సూచించింది.

'ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న గొడవలు లేదా ఇతర ముఖ్యాంశాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను చూపేటప్పుడు వాటి వెనుక ఉన్న అసలు నిజాలను కూడా మెటా స్పష్టంగా చెప్పాలి. ఎందుకంటే చాలా వరకు సోషల్ మీడియాలో వచ్చే పాత ఫొటోలు, వీడియోలు ఎప్పటివి? ఎక్కడివి? అవి నిజమేనా? కాదా? అనేది సామాన్య వినియోగదారులకు వెంటనే అర్థం కాదు. కాబట్టి అలాంటి కంటెంట్ వల్ల ప్రజలు తప్పుదారి పట్టకుండా ఉండటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని' కేంద్రం స్పష్టం చేసింది.

## దేశంలో నిశ్శబ్ద విప్లవం

(మొదటిపేజీ తరువాయి)

తాను ఈ కార్యక్రమానికి క్రమం తప్పకుండా హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, మతసామరస్యం, సమాచార సాంకేతిక రంగం, పంచాయతీరాజ్, యువత సాధికారతకు రాజీవ్‌గాంధీ చేసిన కృషిని తెలంగాణ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సచిన్ ఎం. సావంత్ కొనియాడారు.

పంచాయతీరాజ్ సంస్థల బలోపేతం, స్థానిక పాలనలో మహిళల భాగస్వామ్యం పెంపునకు చొరవ చూపారని చెప్పారు. ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ప్రజాస్వామ్య ప్రక్రియలో విస్తృత భాగస్వామ్యం కల్పించారని పేర్కొన్నారు. కులం, మతం పేరుతో సమాజంలో పెరుగుతున్న విభజనలపై సావంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మతపరమైన విభజనలు దేశాన్ని బలహీనపరుస్తాయని అన్నారు. ప్రేమ, సామరస్యం, జాతీయ సమైక్యత విలువలను కాపాడాలని కోరారు. విద్వేషాన్ని ఎదుర్కొని సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు రాహుల్ చేస్తున్న ప్రయత్నాలకు కార్యకర్తలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. త్యాగం, లౌకికవాదం, జాతీయ సమైక్యత, మతసామరస్యానికి సంబంధించిన రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వ్యవస్థాపకుడు,



మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి. మల్లికార్జునను కార్యక్రమంలో సత్కరించారు. ప్రజాసేవకు అంకితమైన వ్యక్తులను గుర్తిస్తూ ఏటా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులను వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ ఎం. సావంత్, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, మాజీ మంత్రి గీతారెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు అంజన్‌కుమార్‌యాదవ్, ఫిరోజ్‌ఖాన్, డాక్టర్ సి. మల్లికార్జునతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పార్టీ బాధ్యులు, రాజీవ్ సద్భావన పురస్కార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు



(మొదటిపేజీ తరువాయి)

ఖాతాల్లో చేసిన సంబంధిత పోస్టులను తక్షణమే బేషరతుగా తొలగించి, తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ డిమాండ్ చేసింది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని, నోటీసులకు స్పందించని పక్షంలో పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

# హనీ ట్రాప్ ముఠా గుట్టురట్టు

## రూ.25.16 లక్షలు కాజేసిన నిందితుడి అరెస్టు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19 :** అమ్మాయిల పేర్లతో నకిలీ సామాజిక మాధ్యమ ఖా తాలు సృష్టించి, హనీ ట్రాప్, సైబర్ బెదిరింపులకు పాల్పడుతూ రూ. 25.16 లక్షలు కాజేసిన 23 ఏళ్ల కొండభత్తుల పవన్ కుమార్‌ను సైదాబాద్ పోలీసు లు అరెస్టు చేశారు. నిందితుడు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందినవాడు.

**నకిలీ ఖాతాలతో వల**

నిందితుడు నకిలీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా వెయ్యి మందికిపైగా వ్యక్తులతో అమ్మాయిలా పరిచయం పెంచుకున్నాడు. లైంగిక సంభాషణల పేరుతో బాధితుల నగ్న చిత్రాలు, వీడియోలు సేకరించి, వాటిని బయటపెడతానని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేశాడు. తన సోదరితో ఫిర్యాదు చేయిస్తానని భయపెట్టేవాడు. ఈ విధంగా 82 మంది బాధితుల నుంచి రూ. 18 లక్షలు బెదిరించి వసూలు చేశాడు.

**వేర్వేరు మోసాలు**

పెట్టుబడులపై అధిక లాభాలు ఇప్పిస్తానని నమ్మించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ. 7 లక్షలు కాజేశాడు. మరో ఇద్దరి నుంచి రూ. 6.8 లక్షలు, రూ. 7 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, మొత్తం మోసాల వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది. బాధితుల్లో వివిధ వృత్తులకు చెందినవారితోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందినవారూ ఉన్నారు. నిందితుడి నుంచి మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చార్మినార్ జోన్ డీసీపీ ఖేర్ కిరణ్ ప్రభాకర్, అదనపు డీసీపీ ఎం.డి. మజీద్, ఏసీపీ సోమ వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరిగింది.

# పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు

- భూవివాదాల శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం
- భూభారతితో ఏళ్లనాటి భూ సమస్యలకు పరిష్కారం
- 34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్కుల జారీ
- సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:** ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలోని పెద్దల నిర్లక్ష్యం, నిర్వాకం, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల పదేళ్లలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్థవ్యస్తమైందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు సలహాల మేరకు రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. సోమవారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి చట్టం అమలు, రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీ-సర్వే, భూ సమస్యల పరిష్కారం, ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయాల అమలు తీరును సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో మరింత బాగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు కోరిన భూవివాదాలు లేని తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏప్రిల్ 14, 2025 నుంచి ఇప్పటి వరకు 5,68,858 పాస్ బుక్కులు జారీ చేశామని అలాగే ఈ చట్టానికి ముందు 6,71,508 మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాస్ బుక్ లను రైతులకు అందజేయడం జరిగిందని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నా రికార్డుల్లో హక్కులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై ఇబ్బందులు పడుతున్న రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలిచి సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం, నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీ-సర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకుపైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాలలో 15 గ్రామాలల్లో రీ-సర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450ఎకరాలకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పట్టాదారు పాస్‌బుక్‌లతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం లభించిందన్నారు. అలాగే ములుగు జిల్లా ముల్కాపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వరావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగుఆ కొనసాగుతున్న సమస్యకు పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామన్నారు. ఇదే పద్ధతిలో ఇతర ప్రాంతాల్లో కూడా సర్వే నిర్వహించి దశాబ్దాలుగా భూమిపై హక్కుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు హక్కులు కల్పించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో రెవెన్యూ శాఖలో ప్రభుత్వం తీసుకుంటున్న విధాన పరమైన నిర్ణయాలు, ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు జరిగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అన్నారు. జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపై ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ ఢ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ కుటుంబం రూ.50 వేల కోట్ల దోపిడీ

### -మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆరోపణలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై బురదజల్లుతున్నారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండున్నరేళ్లలో రేవంత్‌రెడ్డి కుటుంబం రూ. 50 వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. సీఎం కుటుంబానికి చెందిన కంపెనీలకు భూముల కేటాయింపు, ఒప్పందాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చందనవల్లిలోని సర్వే నంబర్ 363లో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ జరిగిందని, ఇందులో రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డికి చెందిన కంపెనీ పాత్ర ఉందని ఆరోపించారు. 22ఏ పేరుతో భూదందాలు సాగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రిపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ రైతులు పంటలు వేయవద్దని ప్రభుత్వం సూచించడం సరికాదన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ అసైన్డ్ భూములున్నాయం టూ దుష్ప్రచారం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని, అధికార పార్టీ నేతల వ్యాపారాలు మాత్రం పెరుగుతున్నాయని ఆరోపించారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

- ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- గతంలో ఉద్యోగుల వేతనాలు పెంచిన ఘనత కేసీఆర్‌దే
- డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**కాగజ్‌నగర్, వెలుతురు అక్టోబర్ 19 :** రాష్ట్రవ్యాప్తంగా గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కాగజ్‌నగర్‌లోని ప్రాణహిత నిలయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల సర్వీసు ఉన్న రెగ్యులర్ అటెండర్‌కు రూ. 90 వేల జీతం వస్తుంటే, 20 ఏళ్లుగా వైద్యుడిగా పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగికి కేవలం రూ. 45 వేలే వేతనంగా లభిస్తోందని తెలిపారు. ఉద్యోగ భద్రత లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో సుమారు 70 శాతం మంది మహిళలే ఉన్నారని, అయినప్పటికీ కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. వారికి ఈహెచ్‌ఎస్, ఈఎస్‌ఐ సదుపాయాలు వర్తించవని, పదవీ విరమణ ప్రయోజనాలు కూడా ఉండవని తెలిపారు. నెలలు గడిచినా సకాలంలో జీతాలు అందడం లేదని, పైగా లక్ష్యాలను నిర్దేశించి పనిచేయిస్తుండటం దారుణమన్నారు. ఉద్యోగి అనివార్య కారణాలతో మరణిస్తే, దుబాయిలో తెలంగాణ వాసి చనిపోయినప్పుడు చందాలు వేసుకుని సహకరించినట్లుగానే, ఇక్కడ కూడా ఉద్యోగులు చందాలు వేసుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పనిచేసి, పదవీ విరమణకు చేరువవుతున్నా ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ కూడా అందని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతనాల సవరణకు ప్రభుత్వాలు మద్దతు తెలిపాయని గుర్తుచేశారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించినట్లుగానే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నించారని తెలిపారు. అయితే, వీరు కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్నందున అది సాధ్యం కాలేదన్నారు. అయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేకపోయినా బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి వేతనాలు పెంచారని, వారి కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ఉద్యోగులను పట్టించుకునే నాథుడే లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కనీసం ఉద్యోగులను కలిసిన దాఖలాలు కూడా లేవని, వారి సమస్యల పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. 24 గంటలూ ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలని, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# రాష్ట్రప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు

### -టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.






# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- విధి నిర్వహణలో ప్రాణత్యాగం
- ప్రజల గుండెల్లో చిరస్థానం!

ప్రజల ప్రశాంత జీవనానికి భద్రతా కవచంలా నిలుస్తూ.. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తూ.. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయని ధైర్యసాహసాల ప్రతిరూపాలు పోలీసులు. పండుగైనా.. ప్రకృతి విపత్తైనా.. అల్లర్లైనా.. ఉగ్రవాదుల దాడులైనా.. ప్రజల రక్షణ కోసం ముందుండే ఖాకీ దుస్తుల వెనుక ఎన్నో త్యాగాలు, మరెన్నో తీరని కుటుంబ విషాదాలు దాగి ఉంటాయి. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇది కేవలం నివాళు లర్పించే రోజు మాత్రమే కాదు.. ప్రజల భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టిన వీరుల సేవలను గుర్తుచేసుకునే సందర్భం కూడా.

త్యాగానికి ప్రతీకగా అక్టోబర్ 21

1959 అక్టోబర్ 21న లద్దాఖ్‌లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది భారత పోలీసు సిబ్బంది త్యాగానికి గుర్తుగా ఈ రోజును పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బందిని ఈ రోజున స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దేశ సరిహద్దుల నుంచి మారుమూల గ్రామాల వరకు.. నగర వీధుల నుంచి అటవీ ప్రాంతాల వరకు ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకం. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల కట్టడి వంటి విభిన్న బాధ్యతలను పోలీసులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ప్రాణాలకు ముప్పు ఎదురైనా విధి నిర్వహణలో వెనుకడుగు వేయని సిబ్బంది ఎందరో ఉన్నారు. పోలీసు అధికారి లేదా



సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే.. ఆ నష్టం ఒక్క శాఖకే పరిమితం కాదు. ఒక కుటుంబం తన ఆధారాన్ని కోల్పోతుంది. పిల్లలు తండ్రిని, భార్య భర్తను, తల్లిదండ్రులు తమ బిడ్డను కోల్పోతారు. సమాజ భద్రత కోసం ప్రాణాలర్పించిన వారి కుటుంబాలు మాత్రం ఆ త్యాగపు జ్ఞాపకాలతో జీవితాన్ని కొనసాగించాల్సి వస్తుంది. పండుగల సమయంలోనూ, సెలవు రోజుల్లోనూ విధుల్లో ఉండే పోలీసులకు కుటుంబంతో గడిపే సమయం చాలా పరిమితం. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రమాదాలు, పని ఒత్తిడి, దీర్ఘకాలిక విధులు, ఆకస్మిక బందోబస్తులు వారి జీవితంలో భాగమైపోతాయి. అయినప్పటికీ ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతారు. వారి సేవలను గుర్తించడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం సమాజ బాధ్యత. కాలంతోపాటు నేరాల స్వరూపం మారుతోంది. ఒకప్పుడు దొంగతనాలు, దోపిడీలు, భౌతిక దాడులే ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల రవాణా, వ్యవస్థీకృత నేరాలు పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయి. మరోవైపు ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, భారీ జనసమూహాల నిర్వహణ, ఎన్నికల బందోబస్తు వంటి సందర్భాల్లోనూ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసు వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడం, సిబ్బందికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించడం, విధి నిర్వహణలో తగిన రక్షణ పరికరాలు కల్పించడం అవసరం. ప్రాణాలను పణంగా పెట్టే పరిస్థితుల్లో పనిచేసే సిబ్బందికి మెరుగైన ఆరోగ్య సదుపాయాలు, మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు అందించడం కూడా అంతే ముఖ్యం. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నివాళులర్పించడం ఎంత ముఖ్యమో.. వారి కుటుంబాల సంక్షేమాన్ని పట్టించుకోవడం కూడా అంతే ముఖ్యం. అర్హతకు అనుగుణంగా పరిహారం, కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు, పిల్లల విద్యకు సహాయం, వైద్య సదుపాయాలు, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించే చర్యలు సమర్థంగా అమలుకావాలి. అమరవీరుల కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే వ్యవస్థ ఉండాలి. త్యాగం చేసిన వారి కుటుంబాలకు ఇచ్చే గౌరవం మాటల్లోనే కాకుండా చేతల్లోనూ కనిపించాలి. అప్పుడే అమరవీరుల సంస్మరణకు నిజమైన అర్థం చేకూరుతుంది. శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత అయినప్పటికీ.. సురక్షిత సమాజ నిర్మాణం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. చట్టాలను గౌరవించడం, నేరాలపై సమాచారం అందించడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం, మహిళలు, పిల్లల రక్షణకు సహకరించడం, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం ప్రతి పౌరుడి బాధ్యత. పోలీసుల విధులను విమర్శనాత్మకంగా పరిశీలించడంతోపాటు.. వారు ఎదుర్కొనే సవాళ్లను అర్థం చేసుకోవాలి. అదే సమయంలో పోలీస్ వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా, పారదర్శకంగా, మానవీయ దృక్పథంతో పనిచేయడం కూడా అవసరం. ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరిగినప్పుడే నేరాల నియంత్రణ మరింత సమర్థంగా సాధ్యమవుతుంది. పోలీస్ అమరవీరుల దినోత్సవం అనేది గతాన్ని గుర్తుచేసుకునే సందర్భం మాత్రమే కాదు.. వర్తమాన బాధ్యతలను గుర్తించి, భవిష్యత్తుకు భద్రతాయుతమైన సమాజాన్ని నిర్మించుకోవాల్సిన పిలుపు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ప్రతి పోలీసు అమరవీరుడి త్యాగం దేశ చరిత్రలో చెరగని ముద్ర. వారి ధైర్యం, నిబద్ధత, సేవాభావం భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి. ఖాకీ దుస్తుల వెనుక ఉన్న మనిషిని, అతని కుటుంబాన్ని, అతను నిర్వర్తించే బాధ్యతను సమాజం గుర్తించాలి. ప్రజల ప్రశాంత నిద్ర కోసం తమ నిద్రను త్యజించిన పోలీసుల సేవలను గౌరవించాలి. అమరవీరుల త్యాగాలను స్మరించు కుంటూ వారి కుటుంబాలకు అండగా నిలబడటమే వారికి అర్పించే నిజమైన నివాళి. విధి నిర్వహణలో ప్రాణాల ర్పించిన పోలీస్ అమరవీరు లకు అక్షరాం జలి.. వారి త్యాగాలకు శతకోటి వందనాలు!



ఎస్. సునీల్ కుమార్

---

## రైతన్న కన్నీటికి బసవన్న
# బాసటగా నిలవలేరా?

- ప్రకృతి నేస్తం మంజుల పత్తిపాటి





పచ్చని చెట్టులోనూ, పారే నీటిలోనూ, మొలకెత్తే విత్తనంలోనూ ఆ విత్తనాన్ని తన చెమటతో పంటగా మార్చే రైతన్నలో సాక్షాత్తూ ప్రకృతి కనిపిస్తుంది. కానీ అందరి ఆకలి తీర్చే రైతన్న జీవితంలోనే ఆకలి, అప్పులు, కన్నీళ్లు ఎందుకు? ఒకవైపు వాతావరణ మార్పులు, మరోవైపు గిట్టుబాటు ధరల లేమి, భూగర్భజలాల తగ్గుదల, నేల సారం క్షీణించడం... ఇలా రైతన్న ప్రకృతితోనూ, పరిస్థితులతోనూ పోరాడుతున్నాడు. ప్రకృతిని కాపాడే బాధ్యత రైతన్నదే కాదు; ప్రకృతి ఇచ్చే ప్రతి ఫలాన్ని అనుభవించే మనందరిదీ. రైతుకు పర్యావరణహిత వ్యవసాయానికి అవసరమైన సహకారం అందించినప్పుడే భూమి, రైతు ఇద్దరూ బాగుంటారు. ఈ సందర్భంలో బసవన్న చెప్పిన "కాయకమే కైలాసం" అనే సందేశం గుర్తుకొస్తోంది. శ్రమే దైవమైతే, దేశానికి అన్నం పెట్టే రైతన్న శ్రమకు తగిన గౌరవం ఎందుకు దక్కడం లేదు? రైతన్న కష్టాన్ని గౌరవించడం అంటే మాటల్లో పొగడటం కాదు; అతని పంటకు న్యాయమైన ధర, కుటుంబానికి భద్రత, ప్రకృతిని కాపాడే సాగుకు ప్రోత్సాహం అందించడం. రైతన్న, బసవన్న భవిష్యత్తులో కలిసి నడవలేరా? తప్పకుండా నడవగలరు! రైతన్న శ్రమకు బసవన్న భావజాలం తోడైతే, ప్రకృతి పరిరక్షణకు మానవత్వం తోడైతే, సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించగలం. ఒక ప్రకృతి నేస్తంగా మహిళా రైతుగా ఆకాంక్ష ఒక్కటే---రైతన్న కళ్లలో కన్నీళ్లు కాదు, ఆశలు కనిపించాలి. అతని పొలంలో పంటతోపాటు ఆనందం కూడా పండాలి. రైతన్న బతికితేనే వ్యవసాయం బతు కుతుంది... వ్యవసాయం బతికితేనే ప్రకృతి బతుకు తుంది... ప్రకృతి బతికితేనే మన భవిష్యత్తు పచ్చగా ఉంటుంది!



మంజుల పత్తిపాటి ప్రకృతి నేస్తం

---

# జర్నలిస్టుకు సేఫ్టీ ఉందా?

## గ్రౌండ్ లెవల్‌లో అసలేం జరుగుతోంది!




ఒక గ్రామంలో భూమి వివాదం వెలుగులోకి రావాలి.. ప్రభుత్వ పథకంలో అక్రమాలు జరిగితే ప్రజలకు తెలియాలి.. నిరసనలో వినిపించే గొంతు సమాజం దృష్టికి చేరాలి. ఈ పరిణామాల వెనుక వార్త కోసం క్షేత్రస్థాయికి వెళ్లే జర్నలిస్టు పాత్ర కీలకం. పత్రికలో వార్త రాసినా, టెలివిజన్‌లో ప్రసారం చేసినా, డిజిటల్ వేదికపై సమాచారాన్ని అందించినా లక్ష్యం ఒక్కటే.. ప్రజలకు వాస్తవాలు చేరవేయడం. అయితే వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టుకు వృత్తిపరమైన గౌరవం, భద్రత లభిస్తున్నాయా? ప్రశ్నలు అడిగినందుకు బెదిరింపులు ఎదుర్కోవాల్సి వస్తోందా? విధి నిర్వహణలో ఆటంకాలు ఎదురైతే పరిష్కారం లభిస్తోందా? ఇవి ఒక వృత్తికి సంబంధించిన సమస్యలు మాత్రమే కావు. ప్రజలకు సమాచారం అందే స్వేచ్ఛతో ముడిపడిన ప్రజాస్వామ్య అంశాలు. వార్తల్లో తప్పులుంటే ఆధారాలతో ఖండించవచ్చు. చట్ట ఉల్లంఘన జరిగితే నిష్పక్షపాత విచారణ జరపవచ్చు. కానీ విధి నిర్వహణకు ఆటంకం కలిగించడం, పరికరాలను స్వాధీనం చేసుకోవడం, బెదిరింపులకు పాల్పడడం వంటి ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. పత్రికా స్వేచ్ఛకు అసలైన పరీక్ష వేదికలపై చేసే ప్రకటనల్లో కాదు.. క్షేత్రస్థాయిలో వార్త సేకరించే జర్నలిస్టుకు లభించే భద్రతలో ఉంది.

**ప్రెస్ ఐడీ ఉన్నా నిర్బంధమా?**

ప్రజాస్వామ్యంలో పారదర్శక పాలనకు, ప్రజల సమాచార హక్కుకు వారధిగా నిలిచే పాత్రికేయులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సవాళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి. 2026 అక్టోబర్ 10, 11 తేదీల్లో భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల కవరేజీ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొన్న పరిస్థితులు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వచ్చాయి. అమెరికా కేంద్రంగా పనిచేసే కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) అక్టోబర్ 12న ప్రచురించి, అక్టోబర్ 15న సవరించిన నివేదిక ప్రకారం న్యూఢిల్లీ, అహ్మదాబాద్, పుణె, ముంబై నగరాల్లో కనీసం 43 మంది జర్నలిస్టులు తాత్కాలిక నిర్బంధానికి గురయ్యారు. ప్రెస్ గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ కొందరిని అదుపులోకి తీసుకున్నారని, మరికొందరిని వార్తా సేకరణ సమయంలో అడ్డుకున్నారని, ఫోన్లు లేదా ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారని ఆ నివేదిక పేర్కొంది. అక్టోబర్ 12న రాయిటర్స్ ప్రచురించిన కథనం కూడా నిరసనల కవరేజీలో జర్నలిస్టులు ఎదుర్కొన్న నిర్బంధం, భౌతిక ఆటంకాలు, పరికరాల స్వాధీనం వంటి అంశాలను ప్రస్తావించింది. ఈ నివేదికల్లోని వివరాలతోపాటు సంబంధిత అధికారుల స్పందనలు, ఘటనలపై అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను కూడా పరిశీలించాలి. ప్రెస్ గుర్తింపు కార్డు ఉందనే కారణంతో ప్రతి నిర్బంధమూ చట్టవిరుద్ధమని ముందుగానే తేల్చలేం. అలాగే వార్తా సేకరణలో ఉన్నారనే కారణంతో ప్రతి చర్యనూ సమర్థించలేం. ఒక జర్నలిస్టును ఏ కారణంతో అదుపులోకి తీసుకున్నారు? పరికరాలను స్వాధీనం చేసుకోవడానికి చట్టబద్ధమైన ఆధారం ఏమిటి? వార్తా సేకరణకు ఆటంకం కలిగిందనే ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారు? ఇటువంటి అంశాలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. ప్రజా భద్రతను కాపాడే చర్యలు, చట్టబద్ధ విధుల నిర్వహణతోపాటు జర్నలిస్టుల వృత్తి స్వేచ్ఛకూ తగిన గౌరవం లభించాలి.

**అమలులో మార్పు ఎప్పుడు?**

2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ 180 దేశాలు, ప్రాంతాల్లో 157వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్ ఒక్కటే దేశంలోని ప్రతి ప్రాంతంలో పరిస్థితి ఎలా ఉందో నిర్ణయించదు. అయినప్పటికీ పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రతపై అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. నిరసనలు, ఘర్షణాత్మక పరిస్థితుల కవరేజీ సమయంలో మీడియా ప్రతినిధులు, సంబంధిత అధికారుల మధ్య సమన్వయానికి ప్రత్యేక సంప్రదింపు వ్యవస్థ ఉండాలి. విధి నిర్వహణలో ఆటంకాలు ఎదురయ్యాయని లేదా దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పుడు కాలపరిమితితో విచారణ జరిపే విధానం అవసరం. బాధితులకు న్యాయ సహాయం అందుబాటులో ఉండాలి. మీడియా పరికరాలు, సమాచార వనరుల స్వాధీనం విషయంలో చట్టబద్ధమైన ప్రమాణాలు పాటించాలి. అవసరమైన సందర్భాల్లో న్యాయపరమైన పర్యవేక్షణకు అవకాశం ఉండాలి. జర్నలిస్టుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని పరిశీలిస్తే రాజ్యాంగ హక్కులు, అధికారుల చట్టబద్ధ విధులు, న్యాయపరమైన పర్యవేక్షణ, దుర్వినియోగ నిరోధక నిబంధనల మధ్య సమతుల్యత ఉండాలి. చట్టం రూపొందించడం ఒక్కటే పరిష్కారం కాదు. రూపొందించిన మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? బాధితులకు సకాలంలో న్యాయం అందుతోందా? అన్నదే అసలు పరీక్ష. నిరసనల కవరేజీ సందర్భంగా మహిళా జర్నలిస్టులపై వేధింపులు జరిగాయనే ఆరోపణలపై 2026 అక్టోబర్ 15న సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. వార్తా నివేదికల ప్రకారం, ఈ ఆరోపణలపై స్పందనలు కోరడంతోపాటు సంబంధిత ఘటనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని న్యాయస్థానం ఆదేశించింది.

వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464



---

## హామీలకు వంద రోజులు..
# అమలుకు ఎన్నేళ్లు?

**ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు రాజకీయ పార్టీలకు కేవలం ప్రచార వాగ్దానాలు మాత్రమే కాకూడదు. అవి ప్రజలతో చేసుకునే నైతిక బాధ్యతకు ప్రతీకలు కావాలి. ప్రజాస్వామ్యంలో ఓటు అడిగే సమయంలో చెప్పిన మాటకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేసే పనికి మధ్య పొంతన ఉండాలి. ప్రజలు ఒక పార్టీకి ఓటు వేయడం అంటే ఆ పార్టీ ఇచ్చిన హామీలను విశ్వసించడం. అందుకే ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం పాలకుల ప్రాథమిక బాధ్యత. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాల దిశగా ప్రయాణిస్తున్న తరుణంలో కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. ముఖ్యంగా "వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం", "వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం" అని చెప్పిన మాటలు ఇప్పుడు ప్రజల జ్ఞాపకాల్లో మరింత బలంగా నిలిచాయి.**

వంద రోజుల హామీ కాస్తా వెయ్యి రోజుల నిరీక్షణకు చేరువవుతున్న పరిస్థితి ఎందుకు ఏర్పడిందన్నదే ఇప్పుడు తెలంగాణ సమాజం ముందున్న ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలు సాధారణమైనవి కావు. ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువస్తామని, పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, మహిళలకు సాధికారత కల్పిస్తామని, రైతులకు అండగా నిలుస్తామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు ఉపాధి, విద్యార్థులకు న్యాయం, పేదలకు మెరుగైన ఆరోగ్య భద్రత అందిస్తామని ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించారు. ఆరు గ్యారెంటీలతో పాటు వందలాది హామీలను ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచారు. ఈ హామీలు ప్రజల్లో కొత్త ఆశలను రేకెత్తించాయి. పదేళ్ల బిఆర్ఎస్ పాలనకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ప్రజలు ఎన్నుకోవ డంలో ఈ హామీలు కూడా కీలక పాత్ర పోషించాయి. అధికార మార్పు వెనుక కేవలం రాజకీయ అసంతృప్తి మాత్రమే కాకుండా, తమ జీవితాల్లో మార్పు వస్తుందన్న ప్రజల ఆకాంక్ష కూడా ఉంది. ఎన్నికల ప్రచారంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని, అర్హులైన వారికి పథకాల ప్రయోజనాలు, కార్డులు ఇంటి వద్దకే అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య భద్రతకు సంబంధించిన హామీలు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎంతో ఆశను కలిగించాయి. అనారోగ్యం కారణంగా ఒక కుటుంబం ఆర్థికంగా కుప్పకూలకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలు ఆశించారు. అయితే హామీ ఇవ్వడం ఒకటి, దానిని సమగ్రంగా అమలు చేయడం మరొకటి. ప్రభుత్వం ఏర్పడి కాలం గడుస్తున్న కొద్దీ ఈ రెండింటి మధ్య ఉన్న దూరం తగ్గాల్సింది పోయి, కొన్ని సందర్భాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలకు పథకం అంటే కేవలం ఒక ప్రభుత్వ ఉత్తర్వు కాదు. పథకం ప్రారంభమైందని ప్రకటించడం కూడా సరిపో దు. ఆ పథకం ప్రయోజనం అర్హుడైన వ్యక్తి జీవితంలో



కనిపించినప్పుడే దాని అమలు విజయవంతమైనట్లు భావించాలి. ప్రభుత్వ కార్యాలయంలో ఫైలు కదలడం ఒక ప్రక్రియ మాత్రమే; పేద కుటుంబానికి నిజమైన ప్రయోజనం చేరడం అసలు ఫలితం. అందుకే ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రకటించింది, ఎన్ని జీవోలు జారీ చేసింది అనే గణాంకాల కంటే, వాటి ద్వారా వాస్తవంగా ఎంతమంది ప్రజలు లబ్ధి పొందారన్నది ముఖ్యమైన ప్రశ్న. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందుతోందా? దరఖాస్తు చేసుకున్న వారికి పథకం చేరుతోందా? పథకాల అమలులో ఉన్న అడ్డంకులు ఏమిటి? వాటిని ప్రభుత్వం ఎలా అధిగమిస్తోంది? ఈ వివరాలను ప్రజలకు స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో ప్రజలు వంద రోజుల కోసం ఎదురుచూశారు. వంద రోజులు పూర్తయ్యాక కొంతకాలం మరింత ఓపిక పట్టారు. ఆ తర్వాత మరో గడువు వస్తుందని ఆశించారు. ఇప్పుడు కాలం గడుస్తున్న కొద్దీ ఆ నిరీక్షణ అసంతృప్తిగా మారుతోంది. "వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఎప్పుడు పూర్తవుతాయి?" అన్న ప్రశ్న క్రమంగా "మిగిలిన పదవీకాలంలోనైనా అన్ని హామీలు నెరవేరుతాయా?" అనే ప్రశ్నగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజల సహనాన్ని బలహీనతగా భావించడం ఏ ప్రభుత్వానికైనా ప్రమాదకరం. ప్రజలు వెంటనే ఆందోళనకు దిగకపోయినా, తమ మనసులో ప్రభుత్వ పనితీరును మాత్రం నిశితంగా అంచనా వేస్తుంటారు. ప్రభుత్వానికి ఇంకా సమయం ఉందని అధికార పార్టీ నాయకులు చెప్పవచ్చు. ఐదేళ్ల పాలనలో తొలి సంవత్సరాలు పరిపాలనా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడానికి, ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి, గత ప్రభుత్వం నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి అవసరమని వాదించ వచ్చు. ఈ వాదనలో కొంత వాస్తవం ఉండవచ్చు. కానీ అది ప్రజల ప్రశ్నకు పూర్తి సమాధానం కాదు. ఎందు కంటే ఎన్నికల ప్రణాళిక రూపొందించే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వానికి ఎదురయ్యే పరిపాల నా సవాళ్లు, పథకాల అమలుకు అవసరమయ్యే నిధులు వంటి అంశాలపై రాజకీయ పార్టీలకు అవగాహన ఉంటుంది. అయినప్పటికీ నిర్దిష్ట కాలపరిమితిలో హామీలను అమలు చేస్తామని ప్రజలకు చెప్పారు. కాబట్టి ఇప్పుడు అమలులో జాప్యం జరుగుతుంటే, అందుకు గల కారణాలను కూడా అదే స్పష్టతతో ప్రజలకు వివరించాలి. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో ఇచ్చిన హామీలను కేవలం ఒక కార్డు లేదా ఒక పథకం పరిధిలో చూడటం సరైంది కాదు. పేద కుటుంబానికి అనారోగ్యం అంటే అది కేవలం వైద్య సమస్య కాదు; అది ఆ కుటుంబ ఆర్థిక భద్రతకు సంబంధించిన సమస్య కూడా. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి తీవ్రమైన అనారోగ్యం వస్తే ఆదాయం ఆగిపోవచ్చు. వైద్య ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి రావచ్చు. పిల్లల చదువులు మధ్యలో ఆగిపోవచ్చు. ఇల్లు, భూమి, ఆస్తి అమ్ముకునే పరిస్థితి రావచ్చు. అందుకే ప్రభుత్వ ఆరోగ్య భరోసా పథకాలు కాగితాలపై కాకుండా ఆసుపత్రులలో, రోగుల జీవితాల్లో కనిపించాలి. ఎన్ని కార్డులు జారీ చేశామన్నది ఒక గణాంకం మాత్రమే. ఆ కార్డుల ద్వారా ఎన్ని పేద కుటుంబాలకు వాస్తవంగా చికిత్స అందిందో చెప్పడం అసలు కొలమానం. అర్హులైన ప్రజలకు ఆరోగ్య సేవలు అందుతున్నాయా? ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పథకం సక్రమంగా అమలవుతోందా? చికిత్సల విషయంలో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? పథకం పరిధిలోకి రాని వ్యాధులు, ఖరీదైన చికిత్సల విషయంలో ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. ఆరోగ్య భద్రతను ఎన్నికల హామీగా కాకుండా ప్రజల హక్కుగా ప్రభుత్వం చూడాలి. ఒక పేద కుటుంబం అనారోగ్యం కారణంగా అప్పుల పాలవకుండా కాపాడటం సంక్షేమం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కూడా. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం మోపుతూ కాలం గడపడం కూడా ప్రజల సమస్యలకు పరిష్కారం కాదు. గత ప్రభుత్వం అప్పులు చేసిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసిందని ప్రభుత్వం చెబితే, దానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలి. అవినీతి జరిగిందని ఆధారాలు ఉంటే విచారణ జరపాలి. ఆర్థిక అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కానీ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వం తన ఎన్నికల హామీల బాధ్యత నుంచి తప్పించుకోలేరు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది పాత ప్రభుత్వాన్ని విమర్శించడానికి కాదు, తమ జీవితాల్లో మార్పు కోసం. విచిత్రమేమిటంటే, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కొన్ని మౌలిక వసతులు, ప్రారంభించిన ప్రాజెక్టులు, చేపట్టిన పనులకే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగింపుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తోంది. గత పాలనలో నిర్మించిన ఆసుపత్రులు, రహదారులు, వంతెనలు, ముసరాంబాగ్ బ్రిడ్జి వంటి పనులు ప్రజా అవసరాల కోసం కొనసాగించాల్సినవే. ప్రభుత్వం మారినంత మాత్రాన ప్రజా ప్రయోజనంతో కూడిన పనులు ఆగిపోవాల్సిన అవసరం లేదు. అయితే వాటిని ఎవరు ప్రారంభించారు అన్న రాజకీయ లెక్కల కంటే, అవి ప్రజలకు ఎంత ఉపయోగపడుతున్నాయన్నదే ముఖ్యం. గత ప్రభుత్వం తప్పులు చేసి ఉంటే వాటిపై విచారణ జరగాలి, మంచి పనులు చేసి ఉంటే వాటిని కొనసాగించాలి. ప్రజా ధనం ఖర్చు చేసిన పనులకు పార్టీల పేర్లు ఉండవు, అవి ప్రజల ఆస్తులు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల హామీలు చట్టబద్ధమైన ఒప్పందం కాకపోయినా, అవి ప్రజల విశ్వాసానికి ప్రతీకలు. ఓటు అడిగేటప్పుడు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోతే రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. ఒక పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు మరో పార్టీ ఇచ్చిన హామీలతో పోల్చి భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటారు. అందువల్ల హామీల అమలు కేవలం పరిపాలనా అంశం కాదు, అది రాజకీయ నైతికతకు సంబంధించిన అంశం కూడా. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందు కు సాధ్యంకాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ఆర్థిక ఇబ్బందుల పేరుతో వాయిదా వేయడం అనే రాజకీయ సంస్కృతి కొనసాగితే ప్రజల్లో రాజకీయాలపై విసుగు పెరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా పాలనలో సమయం ఉన్నప్పటికీ, ఆ సమయాన్ని హామీలను వాయిదా వేయడానికి ఉపయో గించకూడదు. మిగిలిన కాలానికి స్పష్టమైన కార్యాచ రణ ప్రణాళిక రూపొందించాలి. ఏ హామీ ఎప్పుడు అమలు చేస్తారు? దానికి ఎంత నిధులు అవసరం? ఎంతమంది అర్హులు ఉన్నారు? ఇప్పటివరకు ఎంతమం దికి ప్రయోజనం అందింది? ఇంకా ఎంతమందికి అందించాలి? ఏ పథకానికి ఎలాంటి పరిపాలనా అడ్డం కులు ఉన్నాయి? వాటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం ప్రజలకు బహిరంగంగా వివరాలు ఇవ్వాలి. ప్రభుత్వానికి ఆర్థిక పరిమితులు ఉంటే వాటిని నిజాయితీగా చెప్పడం కూడా ప్రజా స్వామ్య పాలనలో భాగమే. కానీ అస్పష్టత, వాయిదాలు, ప్రకటనలు ప్రజల విశ్వాసాన్ని పెంచవు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు అడుగుతున్న ప్రశ్నలు చాలా సూటిగా ఉన్నాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, వందలాది హామీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచిన తర్వాత కూడా అనేక హామీలు ఎందుకు పూర్తిస్థాయిలో అమలు కాలేదు? ఇంటి వద్దకే పథకాల కార్డులు అందిస్తామని చెప్పిన మాట ఏమైంది? ఆరోగ్య భద్రత కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు పూర్తి స్థాయి భరోసా ఎప్పుడు లభిస్తుంది? రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు ఎదురు చూస్తున్న హామీలలో ఇంకా ఏవి మిగిలి ఉన్నాయి? వాటిని ఎప్పటిలోగా అమలు చేస్తారు? మిగిలిన పదవీ కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిజంగా ప్రజల జీవితాల్లోకి తీసుకురాగలదా? ఈ ప్రశ్నలకు రాజకీయ విమర్శలతో సమాధానం రాదు. గత ప్రభుత్వాన్ని నిందించడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. కొత్త హామీల ప్రకటనలతోనూ ప్రజలకు నమ్మకం కలగదు. ప్రజలకు కావాల్సింది తేదీలు, కార్యాచరణ, నిధులు, పారదర్శకత, ఫలితాలు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ఎన్నికల తర్వాత నిలబెట్టుకోవడమే నిజమైన ప్రజా పాలన. వంద రోజుల హామీ వెయ్యి రోజుల నిరీక్షణగా మారకూడదు. ప్రభుత్వం ఇంకా సమయం ఉందని భావిస్తే, ప్రజలు కూడా అంతకాలం ప్రశ్నించకుండా ఎదురుచూస్తారని అనుకోవడం పొరపాటు. ఎందుకంటే ఓటు వేసే ప్రజలు ఐదేళ్ల పాలనను చివరి రోజున మాత్రమే అంచనా వేయరు. ప్రతి పథకం అమలులో, ప్రతి నిర్ణయంలో, ప్రతి ప్రభుత్వ చర్యలో పాలనను గమనిస్తూనే ఉంటారు. తెలంగాణ ప్రజల సహనానికి కూడా ఒక పరిమితి ఉంటుంది. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకుల మాటలను ప్రజలు మరచిపోలేదు. హామీలను గణాంకాల్లో కాదు, ప్రజల జీవితాల్లో చూపించాలి. పథకం పేరు చెప్పడం కాదు, దాని ప్రయోజనం పేద కుటుంబం చేతిలో కనిపించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు విలువను ఎన్నికల తర్వాతి ఆచరణే నిర్ణయిస్తుంది. తెలంగాణ ప్రజలు ఇప్పుడు మాటలు వినడానికి కాదు, మార్పును చూడడానికి ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులకు ముగింపు పలికి, హామీలను ప్రజల జీవితాల్లో సాకారం చేయడం మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే మార్గం.



మన్నారం నాగరాజు
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

# శంకర్పల్లి బైపాస్ రోడ్డుపై ఘోర ప్రమాదం

**గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం**



**శంకర్పల్లి, వెలుతురు అక్టోబర్ 19 :**
శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం బైపాస్ రోడ్డుపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వాహనం అతివేగంగా ఢీకొనడంతో సింగపూర్ వార్డుకు చెందిన బేగరి మొగులయ్య (48) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం.. బేగరి మొగులయ్య ఆదివారం రాత్రి సింగాపురం బైపాస్ రోడ్డు గుండా వెళుండగా, ఎదురుగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మొగులయ్య కింద పడిపోగా, సదరు వాహనం ఆయన తలపై నుంచి దూసుకెళ్లింది. దీనితో తలకు తీవ్ర గాయాలై ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే సదరు వాహనదారుడు వాహనంతో సహా అక్కడి నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న శంకర్పల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు బైపాస్ రోడ్డులోని సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ జన్మదినం సందర్భంగా కార్మికులకు వస్త్రదానం



**శంకర్పల్లి, వెలుతురు అక్టోబర్ 19 :**
శంకర్పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ ముందస్తు జన్మదిన వేడుకలు మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ నెల 21వ తేదీన ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని, సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని శానిటేషన్, ఇతర విభాగాల కార్మికులకు మున్సిపల్ చైర్మన్ దంపతులు సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రతలో, మున్సిపాలిటీ అభివృద్ధిలో నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. తమ పుట్టినరోజును ఇలా కార్మికుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, ప్రముఖ నాయకులు రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహచర నాయకులు, సిబ్బంది చైర్మన్ ప్రవీణ్ కుమార్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఆరుట్ల సాయిమేస్త్రి యూత్ అసోసియేషన్ దుర్గామాత వద్ద అన్నప్రసాదం

**అన్న ప్రసాద దాత గొర్రెకాపరాల సంఘం**

**ఉపాధ్యక్షుడు చెరుకు శ్రీశైలం లక్ష్మమ్మ దంపతులు**



**మంచాల వెలుతురు అక్టోబర్ 19:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసాయి మే స్త్రియూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాత గొర్రెకాపరుల.సంఘం ఉపాధ్యక్షుడుచెరుకు శ్రీశైలం లక్ష్మమ్మ దంపతుల సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పా ల్గొన్న గ్రామసర్పచ్ మానిపాటిశోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్,మాజీ సర్పం చ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాజీ ఎంపిటిసి చీరాల రమేష్ గోగిరెడ్డి అంజిరెడ్డి,కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష,పెద్దలు గుడ్డిమల్లచంద్రయ్య ముదిరాజ్ వైయస్సార్ మాధగోని జంగ య్యగౌడ్ గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు హాజరై ముందుగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించారు కార్యక్రమంలో ప్రజాసం ఘాల నాయకులు కంబాలపల్లి భాస్కర్ శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రా జుగౌడ్,గ్రామపంచాయతీ,వార్డు సభ్యులు కొండిగారి శ్రావణ్,మంకు మమతా వినోద్,మంద మా ధవి మోహన్ రెడ్డి,పూన్నం రాము,మాడుగుల బాలమణి కృష్ణ గౌడ్,మొర్రిపద్మ ఐలయ్య ఇందిర మ్మ కమిటీసభ్యులు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణ ముదిరాజ్ మారలక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ గ్రా మశాఖ అధ్యక్షుడు నుకం బాలరాజ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం సాయి మేస్త్రి యూత్ అసోసియేషన్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు తది తరు లు పాల్గొన్నారు



# దేవులపల్లి గ్రామంలో ఘనంగా శ్రీదుర్గాభవాని ఉత్సవాలు

**కొడిపల్లి వెలుతురు అక్టోబర్ 19:**
కొడిపల్లి మండల పరిధిలోని దేవులపల్లి గ్రామంలో శ్రీ దేవి నవరాత్రుల సందర్భంగా శ్రీ దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు మహిషాసుర మర్ధిని అవతారం సందర్భంగా ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు ,పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గ భవాని ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఆరుట్లలో సద్దుల బతుకమ్మ సంబరాలు

- అంగరంగ వైభవంగా ఘనంగా అంబరానంటిన మహిళల ఆటపాటలు
- గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి బతుకమ్మ ఆడిన ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభ కుమార్



ఆరుట్లలో వేణుగోపాల భజన మండలి దుర్గామాత వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆరుట్ల గ్రామంలో గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్

**మంచాల వెలుతురు అక్టోబర్ 19:**
మంచాల మండలం సద్దుల బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఆరుట్ల గ్రామంలో శ్రీ చైతన్యయూ త్ వద్ద గౌరమ్మకు బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేసిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శో భాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్.కొత్త కూరగాయల మార్కెట్ మణికంఠయూత్ వద్ద భవాని టిఫిన్ సెంటర్ వద్ద వేణుగోపాలస్వామి భజనమండలి దుర్గామాత వద్ద సాయిమే స్త్రి అసోసియేషన్ వద్ద ఆరుట్ల బస్టాండ్ బొడ్రాయి వద్ద మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలుపెట్టి గౌరమ్మలకు ప్రత్యేక పూజలు చేసి అంగరంగవైభవంగా ఆటపాటలతో డిజె సౌండ్ తో బతుక మ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులుబుట్టి కృష్ణ ముదిరాజ్ చెరుకు నరసింహగౌడ్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జిలమోని శ్రీనివాస్ ముదిరాజ్ గ్రామస్తులు దాసర మోని రమేష్ ముదిరాజ్,నూకం నాగేష్ ముదిరాజ్ బుట్టి జంగయ్య ముదిరాజ్ దాసరమోని శ్రీనివాస్ ముదిరాజ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



ఆరుట్లలో కొత్త కూరగాయల మార్కెట్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆరుట్ల భవాని టిఫిన్ సెంటర్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# హయత్‌నగర్‌లో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠా ప్రథమ వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



- **అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో ప్రత్యేక పూజలు, బోనాల పండుగ**

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు అక్టోబర్ 19 :**
హయత్ నగర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నాబీ శిల బొడ్రాయి ప్రతిష్ఠా ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ హయత్ నగర్ అయ్యప్ప ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించాము ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశాము. ఈ నెల అక్టోబర్ 31, తారీకు నుండి నవంబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము అని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలియజేశారు తెలిపారు. అక్టోబర్ 31 శుక్రవారం ఉదయం 9:30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అనంతరం అభిషేకం, దీపారాధన, పుణ్యాహవాచనం, దేవతా స్థాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 1 శనివారం ఉదయం 10 గంటల నుంచి బోనాల పండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కల్లెం రవీందర్ రెడ్డి, బోడ బిక్షపతి, కల్లెం నవజీవన్ రెడ్డి, సామ తిరుమల రెడ్డి, గజ్జి భాస్కర్ యాదవ్, నక్కా దర్శన్ గౌడ్, సీహెచ్ రమేష్ గౌడ్, నక్కా వెంకటేష్ గౌడ్, గుడాల మల్లేష్, గొడుగు శ్రీరాములు, టి. సునీల్ గౌడ్, బెన్నూరి శైలేష్, పారంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రజావాణి' కార్యక్రమంలో 23 దరఖాస్తుల స్వీకరణ

**మేడ్చల్ జిల్లా వెలుతురు అక్టోబర్ 19:**
మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ (IDOC) సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, IAS, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, మరియు జిల్లా రెవెన్యూ అధికారి (ఇ=హా) మాలతి హాజరై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు, అర్జీదారుల నుంచి మొత్తం 23 దరఖాస్తులు నమోదయ్యాయి. అందిన వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, ఆచరణాత్మకమైన చర్యలు తీసుకొని త్వరతగతిన సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. బాధితులు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనా సిబ్బంది మరియు అర్జీదారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**మిర్యాలగూడ వెలుతురు అక్టోబర్ 19:**
తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి పండుగ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని కోరుకున్నారు. ఈ విజయదశమి సందర్భంగా సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం వెల్లివిరిసి, బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో వారి జనాభా దామాషా ప్రకారం వారి వాటా వారికి కల్పించాలన్నారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 19:**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఖండ కు చెందిన చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంసేవకులు సంప్రదాయ గణవేష్ ధరించి శస్త్ర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ ప్రచార ప్రముఖ్ గీకూరి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి, శమీ పూజ నిర్వహించిన అనంతరం స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, సమాజంలో ధర్మాన్ని, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ గత 100 సంవత్సరాలుగా స్వచ్ఛందంగా దేశ సేవలో నిమగ్నమై ఉందని, వ్యక్తి నిర్మాణం ద్వారానే బలమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాజంలో యువత దేశభక్తిని పెంపొందించుకుని, సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలు లేకుండా సమాజమంతా ఏకతా భావంతో ముందుకు సాగినప్పుడే సుదృఢ భారత్ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి స్వయంసేవకుడు పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ వస్తువుల వినియోగం వంటి పంచ పరివర్తన సిద్ధాంతాలను తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ , మొగిలి సంపత్ , మురళి పెద్ద సంఖ్యలో స్వయం సేవకులు, సంఘ పరివార్ నాయకులు, ప్రముఖులుగ్రామస్థులు పాల్గొన్నారు.





# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 19**
సోమవారం సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన దుర్గామాత నవరాత్రి మండపాల వద్ద నిర్వహించిన అమ్మ వారి ప్రత్యేక పూజల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాచుపల్లి కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట రామాలయం, నిజాంపేట్ డివిజన్ లోని దుర్గా మాత ఆలయం, బండారి లేఔట్ కట్ట మైసమ్మ ఆలయంలో, నిజాంపేట్ డివిజన్ కేటీఆర్ కాలనీలో అసోసియేషన్ సభ్యులు వార్లు ఏర్పాటు చేసుకున్న దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకున్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపి. వివేకానంద్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... శక్తి స్వరూపిణీ, ఆదిపరాశక్తి అయిన దుర్గామాత దయతో ప్రజలంతా ఆయురోరాగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని జీవించాలన్నారు. అనంతరం కేటీఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ సర్కిల్ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు ముదిరాజ్, ప్రణయ ధనరాజ్, దేవి చందు, రవికిరణ్, మరియు నాయకులు, యువకులు, అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.






## అంగడిపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలు..

### అమ్మవారిని దర్శించుకున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**చండూరు, వెలుతురు అక్టోబర్ 19:**
చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో దుర్గాదేవి అవతారంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భవానీ మాతను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తులతో కిటకిటలాడిన ఈ పూజా కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అతిథులకు ఘన స్వాగతం పలికారు.

## మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

**మోత్కూరు, అక్టోబర్ 19, వెలుతురు న్యూస్ :**
మోత్కూరు మున్సిపాలిటీ హనుమాన్ వాడలోని స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు సోమవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనం ఇచ్చింది. ఈ కార్యక్రమంలో పురోహితులు పారునంది హరిబాబు శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం పురోహితులు హరిబాబు శర్మను మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భవాని మాలదారులు పోచం కన్నయ్య, జంపాల సాయికుమార్,చిలకమర్రి రాకేష్, చిప్పలపల్లి సాకేత్, బండారి వరుణ్ కుమార్ ,బుర్ర రోహిత్, బిల్లా సాత్విక్ రెడ్డి, పోచం మధుమిత ,గగన్ శాన్విత, విగ్రహ దాత పున్న ప్రవీణ్, ఉష, పోచం భాస్కర్ జంపాల యోగానందం,అన్నెపువెంకన్న, బందారపు చంద్రశేఖర్, జల్ది సోమయ్య అక్కెనపల్లి రాంబాబు, భవాని భక్తులు, స్వాములు పాల్గొన్నారు.



## గంగోరిగూడెంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి 9వ వార్షికోత్సవం

**మునుగోడు, వెలుతురు అక్టోబర్ 19:**
మునుగోడు మండలంలోని గంగోరిగూడెం గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి 9వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజైన సోమవారం రోజున అమ్మవారు భక్తులకు శ్రీ మహిషాసుర మర్దిని దివ్యరూపంలో దర్శనమిచ్చారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఉత్సవ నిర్వాహకులు పానుగంటి విజయ్ శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు మరియు అర్చనలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి తొమ్మిది సంవత్సరాలుగా శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి చీరలను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులుఅనంత చంద్రశేఖర్ గౌడ్ కి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ తరపున ఘన సన్మానం చేశారు. కాంగ్రెస్ నాయకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ... గత 9 సంవత్సరాలుగా నిర్విరామంగా అమ్మవారికి పట్టువస్త్రాలు (చీరలు) సమర్పించే మహద్భాగ్యాన్ని, సేవ చేసే అవకాశాన్ని కల్పించిన



గంగోరిగూడెం గ్రామ సమస్త భక్త బృందానికి మరియు తమ మిత్రులు, శ్రేయోభిలాషులైన పానుగంటి విజయ్ వారి బృందానికి ప్రత్యేకంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## న్యూజిలాండ్‌కు ఎగుమతులపై పన్నులు తొలగింపు



**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 19:**
భారత్ నుంచి న్యూజిలాండ్ కు చేసే ఎగుమతులపై రేపటి నుంచి పన్నులు ఉండవని విదేశీ వాణిజ్య విభాగం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో ప్రామర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉత్పత్తి అవుతున్న వ్యవసాయ ఆధారిత ఆహార ఉత్పత్తులను తొలిసారిగా న్యూజిలాండ్ కు ఎగుమతి చేసే కంటైనర్ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, భారత న్యూజిలాండ్ దేశాల మధ్యన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం ఈ సంవత్సరం ఏప్రిల్ లో కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం మన దేశం నుంచి న్యూజిలాండ్ కు చేసే ఫార్మా వ్యవసాయ ఆహార వస్త్ర ఉత్పత్తులపై పన్నులు ఉండవని చెప్పారు. ఆదేశం నుంచి మనకు దిగుమతి అయ్యే వస్తువులపై కూడా భారత ప్రభుత్వం పన్నులను తొలగించిందని వెల్లడించారు. దీనివల్ల రెండు దేశాలకు మేలు జరుగుతుందన్నారు. న్యూజిలాండ్ జనాభాలో ఐదు శాతం మంది భారతీయులే ఉన్నారని చెప్పారు. వారు భారతదేశానికి ప్రతినిధులుగా అక్కడ ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విదేశీ వాణిజ్య విభాగం అధికారులు పలువురు పాల్గొన్నారు





## రైతుల కన్నీళ్లు తుడవాలంటే ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**మునుగోడు, అక్టోబర్ 18 (వెలుతురు )**
మునుగోడు నియోజకవర్గ రైతుల కన్నీళ్లు తుడవాలంటే పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇరుగు దిండ్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్లగూడెం (శివన్నగూడెం) ప్రాజెక్టు పనులు పూర్తయ్యే వరకు ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి మునుగోడులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గం కరువు పరిస్థితులతో సతమతమవుతోందని, సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. చర్లగూడెం ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, మునుగోడు ప్రాంతాల్లోని భూములకు సాగునీరు అందడంతో రైతుల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ప్రాజెక్టు సాధన కోసం అఖిలపక్ష నాయకులు, ప్రజలు పార్టీలకు అతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బతుకమ్మలను పరిశీలించి ఉత్తమ బతుకమ్మలను బహుమతులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## పైడిగుమ్మల్ క్రికెట్ టోర్నీలో మహమ్మద్ ఫిర్దోస్ సర్వర్‌కు ఘన సన్మానం

### బెస్ట్ సపోర్టర్ అవార్డుతో సత్కారం

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సీజన్--1 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక సేవకుడు మహమ్మద్ ఫిర్దోస్ సర్వర్‌కు నిర్వాహకులు, గ్రామ ప్రముఖులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జై సీమా రెడ్డి పటేల్, శ్రీధర్ రెడ్డి శాలువా కప్పి, పూలతో సత్కరించారు. అనంతరం టోర్నమెంట్‌కు ఆయన అందిస్తున్న సహకారాన్ని గుర్తించి 'బెస్ట్ సపోర్టర్' ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఫిర్దోస్ సర్వర్ టోర్నమెంట్ నిర్వాహకుడు మహమ్మద్ ఫెరోజ్‌తో పాటు పైడిగుమ్మల్ గ్రామ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణ యువతలో ఐక్యత, స్నేహభావం, క్రమశిక్షణను పెంపొందించ డంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడు తుందని పేర్కొన్నారు.



## రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడంతో ప్రమాదం.. ఒకరు మృతి

రోడ్డు పై మొక్కజొన్న ధాన్యం ఆరబెట్టడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. బుస్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం రాత్రి 8:20 గంటలకు బుస్సాపూర్ నుంచి గజ్వేల్‌కు వెళ్తుండగా ఘణపూర్ శివారులో రోడ్డు పై పోసిన మొక్కజొన్న కుప్పను గమనించలేక బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పై రోడ్డుపై ధాన్యం పోసిన ఇద్దరు రైతులపై తొగుట పోలీసులు కేసు నమోదు చేశారు. రైతులకు పోలీసుల హెచ్చరిక : రోడ్లపై ఎలాంటి ధాన్యాన్ని ఆరబెట్టవద్దని, ఇది ప్రమాదాలకు దారితీస్తుందని తొగుట పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ గోలి ప్రభాకర్.

**మోత్కూర్, అక్టోబర్ 19,వెలుతురు న్యూస్ :**
రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో దివ్యాంగుల హక్కుల సాధన కోసం దశలవారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ గోలి ప్రభాకర్ హెచ్చరించారు. అవసరమైతే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. సోమవారం ఉదయం మోత్కూర్ మండల బీజేపీ అధ్యక్షులు గూదె మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన పాటిమట్ల చౌరస్తాలో నిర్వహించిన మండల దివ్యాంగుల సమావేశానికి గోలి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులకు అనేక హామీలు ఇచ్చారని, వాటిలో ప్రధానంగా దివ్యాంగుల పింఛన్‌ను నెలకు రూ. 6,000కు పెంచడం, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, దివ్యాంగుల హక్కుల చట్టం--2016ను పూర్తి స్థాయిలో అమలు చేయడం, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం వంటి హామీలు ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఈ హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని మోసం చేయడం అన్యాయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేస్తామని ప్రచారం చేసిన రాహుల్ గాంధీ, రాష్ట్రంలోని దివ్యాంగులకు ఇచ్చిన హామీల అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు నిర్వహించి, అవసరమైతే రాహుల్ గాంధీ ఇంటి ముట్టడి చేపడతామని హెచ్చరించారు. మండల దివ్యాంగుల విభాగం నూతన నియామకాలు ఈ సమావేశంలో మోత్కూర్ మండల దివ్యాంగుల విభాగం కన్వీనర్‌గా ఇట్టబోయిన అంజయ్య, కో-కన్వీనర్‌గా బట్టమేకల శిరీషలను నియమిస్తూ గోలి ప్రభాకర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా దివ్యాంగుల విభాగం జిల్లా కో-కన్వీనర్ కోనేటి రవి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు జితేందర్ రెడ్డి, మాజీ బీజేపీ పట్టణ అధ్యక్షులు పోచం సోమయ్య, బీజేపీ నాయకులు చింతల నర్సిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నర్సింగ్ మహేష్, గుంటి సతీష్, నల్లపోగుల వెంకటేష్, నాయనీ ఉపేందర్, వల్లపు మల్లేష్, ముక్కముల మచ్చగిరి, కందికట్ల అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## మోత్కూర్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆలకుంట్ల రాజు నియామకం

**మోత్కూర్, అక్టోబర్ 19,వెలుతురు న్యూస్ :**
తుంగతుర్తి శాసనసభ్యులు శ్రీ మందుల సామెలు ఆదేశానుసారం మోత్కూర్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆలకుంట్ల రాజు ను జిల్లా యూత్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ గారు నియమించారు .ఈ సందర్భంగా మండల ,పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ, యువతను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు నడిపిస్తూ, పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువతను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తుంగతుర్తి శాసనసభ్యులు శ్రీ మందుల సామెలు గారికి,డీసీసీ అధ్యక్షులు బీర్ల అవిలయ్య,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారికి,యూత్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్ గారికి,మండల ,పట్టణ అధ్యక్షులకు , కాంగ్రెస్ కార్యకర్తలకు అందరికీ ఆలకుంట్ల రాజు కృతజ్ఞతలు తెలియజేస్తూ, యూత్ కాంగ్రెస్ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల,పట్టణ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్,బద్దం నాగార్జున రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మీ నర్సింహా రెడ్డి,బొడ్డుపెల్లి కళ్యాణ్ చక్రవర్తి, మందుల సురేష్,గడ్డం సోమ నర్సయ్య,ఐజజ కార్యదర్శి కూరెళ్ళ శ్రీరాములు,మాజీ పట్టణ అధ్యక్షులు గుండగొని రామచంద్రు గౌడ్, మండల యూత్ ఉపాధ్యక్షుడు సుంకిశాల అనిల్,మండల నాయకులు ఎడ్ల భగవంత్ ,కొసను ఉప్పలయ్య ,దేవరపల్లి రంగా రెడ్డి, గానగాని నర్సింహ,గడ్డం లక్ష్మయ్య, కందుకూరి మురళి , బందేల రవి ,పల్లపు సమ్మయ్య,కళ్ళెం నర్సయ్య, దశరథ, కుమార్,స్వామి, నరేష్, కొంపల్లి రాజు, కొంపల్లి శంకర్, మచ్చగిరి,నవీన్,సందీప్, సాయి, క్రిష్ణ, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.



## 'సీఎం గారు మాటల్లో కాదు... చేతల్లో ప్రేమ చూపండి'

: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు... పాలమూరుపై ప్రేమను మాటల్లో కాదు... ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలలో చూపాలి అని ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల సాధన కమిటీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి, కో కన్వీనర్ బెక్కం జనార్దన్ అన్నారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తరతరాలుగా పాలమూరుకు అన్యాయం జరుగుతోంది.. తెలంగాణ వచ్చాక... బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పాలమూరుకు నీటి కష్టాలు తీరుతాయి అనుకుంటే వాళ్ళు అన్యాయం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పాలమూరు జిల్లా నీటి కష్టాలను తీరుస్తుంది అనుకుంటే.. ఇప్పుడు ఆ పార్టీ కూడా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే పరిస్థితులు కనిపించడం లేదని రాజేందర్ రెడ్డి చెప్పారు.
తెలంగాణ వచ్చి 11 ఏళ్లు పూర్తి అయ్యి.. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకుందాం అనుకుంటే.. డిండి ప్రాజెక్టు పేరుతో.. నల్గొండ జిల్లాకు సాగునీటిని తీసుకెళ్లేందుకు ఆగమేఘాల మీద పనులు జరుగుతున్నాయి.. మరోసారి పాలమూరు ప్రజల కడుపు గొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టును ఆపి పాలమూరు..రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను అన్నింటిని పూర్తి చెయ్యాలి అని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పాలమూరుకు ఇంత అన్యాయం జరుగుతున్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఒక్కడే ధైర్యంగా ముందుకు వచ్చి పాలమూరుకు అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. మిగతావాళ్లు ఎందుకు ముందుకు రావడం లేదు.. రాజకీయాలే ముఖ్యమా... జిల్లా ప్రయోజనాలు మీకు ముఖ్యం కాదా అని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాపై మీ ప్రేమను మాటల్లో కాదు... చేతల్లో చూపాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణా నది దాదాపుగా 300 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోంది.. కానీ నీళ్లను తీసుకునే పరిస్థితులను పాలకులు కల్పించక ఈ ప్రాంతం ఎడారిగా.. వలసల జిల్లాగా.. కరువు జిల్లాగా మారిందన్నారు. నల్గొండ జిల్లాకు నాగార్జునసాగర్, ఎస్ ఎల్ బి సి ద్వారా సాగునీటిని ఇవ్వచ్చు.




కానీ పాలమూరు... రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి రిజర్వాయర్ నుండి డిండి ప్రాజెక్టు పేరుతో నీటిని తరలిస్తే... ఈ జిల్లా పరిస్థితి ఏమవుతుందో పాలకులు గుర్తించలేకపోతున్నారు అన్నారు. ఈ గడ్డ నా పుట్టిన వీరుడు పండగ సాయన్న బీద ప్రజల కోసం చేసిన పోరాటాలు అన్ని ఇన్ని కావు.. నీటి వనరుల ఏర్పాటుకు, పేదల కడుపు నింపేందుకు ఎనలేని కృషి చేశారు అని జలసాధన కమిటీ కో కన్వీనర్ బెక్యం జనార్ధన్ అన్నారు. ఆ మహానుభావుడిని, గతంలో నీటి వనరులను కల్పించేందుకు కృషి చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకొని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయవలసిన ఈ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని ఆరోపించారు.
డిండి ప్రాజెక్టు కు నీటిని తరలిస్తే పాలమూరు... రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసిన ప్రయోజనం ఉండదు.. ఈ ప్రాంతమంతా ఎడారిగా మిగిలిపోవడం ఖాయమని బెక్కం జనార్దన్ చెప్పారు. పండుగ సాయన్న జయంతి వేడుకలను ఈనెల 22న అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే రోజున ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టుల సాధన కమిటీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ చేపడతామని జనార్దన్ తెలిపారు. రైతులందరితో సంతకాలు సేకరించి.. పాలకులకు దరఖాస్తులు ఇచ్చి... దండం పెట్టి కార్యక్రమాలను ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కమిటీ సభ్యులు చెన్నై కిష్టయ్య, రెహమాన్, తిమ్మప్ప, రఫీక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి



విద్యార్థులు, యువకులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు. యువత సామాజిక సేవతో పాటు రాజకీయ రంగంలోనూ రాణిస్తూ, క్రమశిక్షణ కలిగిన నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సోమవారం ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో తాటిపర్తి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాయిచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల బహుమతుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు.
బాలుర వాలీబాల్ పోటీల్లో అలమాయపల్లి జట్టు ప్రథమ బహుమతి సాధించగా, అప్పారెడ్డిపల్లి జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుంది. బాలుర కబడ్డీ పోటీల్లో మానాజీపేట జట్టు మొదటి బహుమతి, షాపూర్ జట్టు రెండో బహుమతి సాధించాయి. మహిళల వాలీబాల్ పోటీల్లో కేజీబీవీ జట్టు ప్రథమ బహుమతి గెలుచుకోగా, దేవబండ తండా జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. మహిళల కబడ్డీలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు మొదటి బహుమతి గెలుచుకోగా, దొంతికుంట విద్యార్థినులు రెండో బహుమతి సాధించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ. 20 వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ. 10 వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. అనంతరం ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పద్మమ్మ, పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ముఖ్య నాయకులు, ఎస్సై వెంకటేష్, మహిళలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన బిజెపి జిల్లా ఓబీసీ అధ్యక్షులు

**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 19 :**
మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని బుజరాన్ పల్లి టింకటి గ్రామాలలో ప్రతిష్టించిన అమ్మవారి మంటపాలలో సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు కోణం విట్టల్ సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారి ప్రత్యేక దర్శనం చేసుకొని అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలలో అమ్మవారి మంటపాల నిర్వాహకులు శాలువాలతో కోణం విట్టల్ ను సన్మానించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకయ్య అంజయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చిలుముల విఠల్ రెడ్డి 13వ వర్ధంతి



- పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి
- జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు, కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్

**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 19:**
కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే చిలుముల విఠల్ రెడ్డి గారి 13వ వర్ధంతి సందర్భంగా కౌడిపల్లి లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు విఠల్ రెడ్డి గారు ప్రజలకు చేసిన సేవలను, ముఖ్యంగా పేదల సంక్షేమం కోసం అందించిన సేవలను, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచి, పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆయన వంటి నాయకుల సేవలను ఎప్పటికీ మరువలేమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ సందర్భంగా కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ "విఠల్ రెడ్డి గారు చూపిన మార్గం మాకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు దేవేందర్, రమేష్, నాయకులు మాటూరి శాఖయ్య,పుండరికం గౌడ్, భూమయ్య పటేల్, నాయిని అశోక్, కారోబార్ ఎల్లం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రావణ దహనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:**
విజయదశమి పండుగను పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలోని శివాలయం ప్రాంతంలో నిర్వహించనున్న రావణ దహన కార్యక్రమం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ పరిశీలించారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో పరిశుభ్రత, ప్రజల రాకపోకలకు అనుకూలమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు సురక్షితంగా వేడుకలను వీక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రావణ దహనం సందర్భంగా అగ్నిప్రమాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని



పేర్కొన్నారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని మహమ్మద్ యూనుస్ అన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడం సామాజిక సామరస్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. దసరా స్ఫూర్తితో చెడును విడిచిపెట్టి, మంచి మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, డీఎస్పీ సైదా నాయక్, ఎస్సై లవకుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిరీష సురేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నామా రవికిరణ్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు షణ్ముఖ్, కాంగ్రెస్ నాయకుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలలో పాల్గొన్నా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 19:**
మన ప్రియతమ నాయకుడు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి వారిని శాలువాతో సత్కరించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐజజ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేశవపట్నంలో ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

- పాల్గొన్న ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్‌కుమార్



**కేశవపట్నం వెలుతురు అక్టోబర్ 19:**
గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు -- ఏర్పాట్లను పరిశీలించిన ఉపసర్పంచ్ కేశవపట్నం గ్రామంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలోని రెండు ప్రధాన ప్రాంతాలైన మార్కెట్ యార్డ్ పరిధి, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బతుకమ్మ వేడుకల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో పాల్గొనే మహిళలు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు సౌకర్యవంతంగా కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం చేసిన ఏర్పాట్లతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కేశవపట్నం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్ పాల్గొని, మార్కెట్ యార్డ్ మరియు గ్రామ పంచాయతీ కార్యాలయం పరిధిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పండుగను గ్రామ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునేలా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం విశేషం.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా కానుకలు

- హుగ్గెల్లీ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన వస్త్రాల పంపిణీ



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:**
విజయదశమి పండుగను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గెల్లీ గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి దసరా కానుకగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పండుగ వేళ సిబ్బందికి వస్త్రాలు అందజేసి వారిలో ఆనందాన్ని నింపారు. ఈ సందర్భంగా సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది కృషి అభినందనీయమని తెలిపారు. వారి సేవలను గుర్తిస్తూ దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహిపాల్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అశోక్‌నగర్‌లో ఘనంగా శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 19:**
కరీంనగర్ నగరపాలక సంస్థ అశోక్ నగర్ లో శ్రీదేవి నవరాత్రి వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ వేడుకల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నిర్వహించిన పల్లకి సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల కోలాహలాలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన



ఈ సేవలో భక్తులు భక్తిభావంతో పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారు సర్వాభూషణ భూషితయై భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమా వెంకటరమణ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలందరూ ఆ శ్రీదేవి కృపతో సుఖసంతోత్సవాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు . ఉత్సవ కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో ఈ వేడుకలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి.

## రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు

- వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటు
- గతం కంటే మెరుగ్గా బతుకమ్మ ఏర్పాట్లు చేశాం
- చల్లా హరిశంకర్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ కౌంటర్..




**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 19:**
రాజకీయ లబ్ధి, ప్రచార ఆర్భాటం కోసమే బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని బిజెపి కార్పొరేటర్ సోమిడి వేణు ఘాటుగా విమర్శించారు. బతుకమ్మ ఏర్పాట్లపై బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక ఎస్బిఎస్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమిడి వేణు మాట్లాడారు. పండగ సమయంలో ప్రతిపక్ష నాయకులు ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి, ప్రచారం కోసం అవాస్తవాలు మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గతం కంటే తమ పాలకవర్గం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ ఏర్పాట్లను ఎంతో ఘనంగా నిర్వహించిందని స్పష్టం చేశారు. రూ. 3 కోట్లతో 28 బతుకమ్మ పాయింట్ల వద్ద సదుపాయాలు బతుకమ్మ వేడుకల కోసం రూ. 3 కోట్ల నిధులు కేటాయించి, మొత్తం 28 బతుకమ్మ పాయింట్ల వద్ద అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్, సౌండ్ సిస్టమ్ స్టోన్ డస్ట్ చదును, బారికేడింగ్ పారిశుధ్యం, మంచినీటి సదుపాయాలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిన్నటితో సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రశాంత వాతావరణంలో గొప్పగా ముగించామని వివరించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు తమ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయడంలో సంపూర్ణంగా సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనులను చూడకుండా, ఉనికి చాటుకోవడం కోసం బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో దుర్గమాత నిమజ్జన ఉత్సవాలను ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని సోమిడి వేణు ప్రశ్నించారు. తమ పాలకవర్గం చరిత్రలో మొదటిసారిగా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాతల నిమజ్జనానికి కూడా భారీ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. మానకొండూరు, కొత్తపల్లి చెరువులను ఎంపిక చేసి క్రేన్లు, బారికేడింగ్, తాగునీరు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. గతంలో గణేష్, బతుకమ్మ ఉత్సవాలను నామమాత్రంగా చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

**8 నెలల్లోనే వందలాది కోట్ల నిధులు.. అభివృద్ధికి శ్రీకారం**

తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన 8 నెలల్లోనే వందలాది కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి నగర అన్ని రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని, ఇవన్నీ ప్రజల కళ్ళముందే కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకంగా వ్యవహరించడం సిగ్గుచేటని, బతుకమ్మ పండగను సాకుగా మలచుకుని రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, మండన్నా, గజే శివరాం, పవన్ కళ్యాణ్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిగార్‌పల్లి ప్రీమియర్ లీగ్ విజేతగా చిరాగ్‌పల్లి

- శేఖపూర్ తండాపై 17 పరుగుల తేడాతో విజయం...
- విజేతకు రూ.80 వేలు.. రన్నరప్‌కు రూ.40 వేలు నగదు బహుమతి




**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:**
క్రీడల్లో అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో ఆడిన జట్లే అంతిమంగా విజయం సాధిస్తాయని మొగుడంపల్లి మండల నాయబ్ తహసీల్దార్ మహమ్మద్ జుబేర్ అన్నారు. గెలిచినవారు పొంగిపోకుండా, ఓడినవారు కుంగిపోకుండా క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. వచ్చే ఏడాది నిర్వహించే టోర్నమెంట్‌కు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని గొట్టిగార్ పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన గొట్టిగార్ పల్లి ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) సీజన్-5 (2026) క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి ఆహ్వానం మేరకు నాయబ్ తహసీల్దార్ మహమ్మద్ జుబేర్, ఎంపీడీవో శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**17 పరుగుల తేడాతో చిరాగ్‌పల్లి విజయం**

టోర్నమెంట్ ఫైనల్‌లో శేఖపూర్ తండా సీసీ, చిరాగ్‌పల్లి సీసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన శేఖపూర్ తండా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చిరాగ్‌పల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. అనంతరం 97 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శేఖపూర్ తండా జట్టు నిర్ణీత ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 79 పరుగులకే పరిమితమైంది. దీంతో చిరాగ్‌పల్లి జట్టు 17 పరుగుల తేడాతో విజయం సాధించి జీపీఎల్ సీజన్-5 విజేతగా నిలిచింది.



**విజేతకు రూ.80 వేలు నగదు బహుమతి**

టోర్నమెంట్‌లో రెండోసారి విజేతగా నిలిచిన చిరాగ్‌పల్లి సీసీ జట్టుకు రూ. 80 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన శేఖపూర్ తండా సీసీ జట్టుకు రూ. 40 వేల నగదు బహుమతి, ట్రోఫీని నాయబ్ తహసీల్దార్ జుబేర్, ఎంపీడీవో శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు సునీల్ శెట్టి, సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, ఉపసర్పంచ్ పాండు రూ. 10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

**యువత క్రీడల వైపు మళ్లాలి**

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రస్తుత యువత సెల్‌ఫోన్లకు ఎక్కువ సమయం కేటాయించడం ఆందోళనకరమన్నారు. గ్రామాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతను సన్మార్గంలో నడిపించడంతోపాటు వారిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఐకమత్యం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సర్పంచులు చొరవ తీసుకొని క్రీడా టోర్నమెంట్లు నిర్వహించాలని కోరారు. క్రీడలు యువతలో పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, ఖాన్ జమాల్‌పూర్ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, సీనియర్ నాయకులు, జహీరాబాద్-నారాయణఖేడ్ లియాఫీ సంఘం అధ్యక్షుడు ఈ. విఠల్ గౌడ్, డీలర్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పాండు, మాజీ సర్పంచ్ జయరాజ్, మాజీ ఎంపీటీసీ బిచప్ప, వార్డు సభ్యుడు టి. సిద్ధయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు నర్సింలు, సునీల్, నరేష్, నాథన్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి

- ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- రైతులు పాడిపంటలతో కళకళలాడాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యాఫై.

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:**
చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ప్రముఖ సామాజిక సేవకులు ఖిజర్ యాఫై అన్నారు. రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపు కుంటారని పేర్కొన్నారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆనందం, విజయాలు నింపాలని



ఆకాంక్షించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో కళకళలాడాలని, వ్యాపార వర్గాలు అధిక లాభాలు సాధించి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ ఖిజర్ యాఫై విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కౌడిపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- హాజరైన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి
- గ్రంథాలయ సంస్థ చైర్మన్ తిరుమల సువాసన రెడ్డి
- పాల్గొన్న నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ యాదవ్



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 19:**
కౌడిపల్లి మండల కేంద్రంలో ఈరోజు సద్దుల బతుకమ్మ వేడుకలు కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన నేతలు మాట్లాడుతూ
తెలంగాణ సాంస్కృతిక ఆత్మకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ. "బతుకమ్మ" అంటే "బతుకు అమ్మ" లేదా "జీవితాన్ని ప్రసాదించే తల్లి" (గౌరీ దేవి) అని అర్థం. మహాలయ అమావాస్య (పెత్రామస) రోజున ప్రారంభమై, దుర్గాష్టమి (సద్దుల బతుకమ్మ) వరకు తొమ్మిది రోజుల పాటు ఈ పూల పండుగను ఘనంగా జరుపుకుంటారు అని అన్నారు.



**తొమ్మిది రోజుల బతుకమ్మ పేర్లు మరియు నైవేద్యాలు.**

1వ రోజు ఎంగిలి పూల బతుకమ్మ (మహాలయ అమావాస్య) నువ్వులు, బియ్యం పిండి, బెల్లంతో చేసిన నైవేద్యం
2వ రోజు అటుకుల బతుకమ్మ అటుకులు, బెల్లం, పప్పులు
3వ రోజు ముద్దపప్పు బతుకమ్మ ముద్దపప్పు, బెల్లం
4వ రోజు నానబియ్యం బతుకమ్మ నానబెట్టిన బియ్యం, బెల్లం
5వ రోజు అట్ల బతుకమ్మ అప్పులు / అట్లు
6వ రోజు అలిగిన బతుకమ్మ (అలక బతుకమ్మ) ప్రత్యేక నైవేద్యం ఉండదు
7వ రోజు వేపకాయల బతుకమ్మ బియ్యం పిండిని వేపకాయల సైజులో చేసి నూనెలో వేయించినవి (సకినాలు)
8వ రోజు వెన్నముద్దల బతుకమ్మ వెన్న, నువ్వులు, బెల్లం
9వ రోజు సద్దుల బతుకమ్మ (పెద్ద బతుకమ్మ) ప్ ౢ లి హో ం్ , దద్దోజనం, కొబ్బరి సద్ది, నువ్వుల సద్ది వంటి 5 రకాల సద్దులు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు మెంబర్లు రెడ్డి మాధవి మహేష్, ప్రశాంత్, లక్ష్మి శరత్ కుమార్, చిలుముల రాజిరెడ్డి, దేవేందర్, మురళి, మక్బూల్, సందీప్ కుమార్, బొంతమ్మ సంగప్ప, రమేష్ నాయక్ మరియు గ్రామప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# ఏడు వేల మంది పేద పిల్లలకు నాణ్యమైన విద్య

## దుండిగల్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ పాఠశాలకు భూమిపూజ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19 :**
ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీ పోచంపల్లిలో నిర్మించనున్న 'ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ పాఠశాల'కు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ భూమిపూజ చేశారు. రౌండ్ టేబుల్ ఇండియా--ఏరియా 9 ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పరిసర ప్రాంతాల్లోని సుమారు ఏడు వేల నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్యా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.
ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేసి, వారి అభివృద్ధికి విస్తృత అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టిన రౌండ్ టేబుల్ ఇండియా--ఏరియా 9 ప్రతినిధులను అభినందించారు. మేడ్చల్--మల్కాజిగిరి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, ఈ పాఠశాల పరిసర ప్రాంతాల పిల్లలు, వారి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుందని తెలిపారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత వర్గాలన్నీ పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.
రౌండ్ టేబుల్ ఇండియా--ఏరియా 9 (2026--27) చైర్మన్ అనిరుధ్ సోంపల్లి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయని, పిల్లలు ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా పాఠశాలను నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల నమోదును పెంచడంతో పాటు, వారు నిరంతరంగా చదువుకునేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు.
ఈ పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విద్యకు సంబంధించిన ప్రయోగశాలలు, డిజిటల్ అభ్యాస సదుపాయాలు, గ్రంథాలయం, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సేవలందించేలా దీనిని తీర్చిదిద్దనున్నామని పేర్కొన్నారు. ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య పొందే హక్కు ఉందని, వేలాది మంది పిల్లల భవిష్యత్తుకు ఈ పాఠశాల పునాది కానుందని అన్నారు. అవసరమైన అనుమతులు, నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే పాఠశాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని వెల్లడించారు.
రౌండ్ టేబుల్ ఇండియా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్' కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. పిల్లలకు సురక్షితమైన, సమ్మిళితమైన అభ్యాస వాతావరణాన్ని అందించడంతో పాటు, విద్యా మౌలిక వసతుల కొరతను అధిగమించి వారి ఆశయాలను నెరవేర్చుకునేందుకు అవకాశాలు కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం.
ఈ కార్యక్రమంలో ఇమేజ్ హాస్పిటల్స్, సీవీఆర్ న్యూస్ చైర్మన్ సీవీ రావు, ప్రెస్‌స్టీల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్స్ డైరెక్టర్ వనజ సోంపల్లి, రౌండ్ టేబుల్ ఇండియా--ఏరియా 9 కార్యదర్శి, కోశాధికారి అభిషేక్ అగర్వాల్, ఏరియా వైస్ చైర్మన్ బీ. లోకేశ్వర్ రెడ్డి, మాజీ ఏరియా చైర్మన్ కౌశిక్ యక్కల, ప్రాజెక్టు మార్గదర్శి నిర్మల్ ఉప్పుగండ్ల, చైతన్య చిన్నం, భరత్ వర్మ ఉద్దరాజు, పట్టాభి రామయ్య, గౌరవ్ అగర్వాల్, ఉమంగ్ దాగా, తాడి సందీప్ రెడ్డి, సుధాన్షు షా, దిలీప్ అరవింద్, జాతీయ గౌరవ టేబులర్ ఆశిష్ సొంతాలియా తదితరులు పాల్గొన్నారు. పాఠశాల నిర్మాణ ప్రణాళిక, భవన రూపకల్పనను 'మేక్‌స్పేస్ ఆర్కిటెక్ట్స్'కు చెందిన రజత్ సంఘ్వీ రూపొందించారు

## మల్లాపూర్‌లో ఘనంగా శ్రీ శ్రీ శారదీయ దుర్గోత్సవం- 2026

### దుర్గోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మల్లాపూర్ వెలుతురు అక్టోబర్ 19:**
మల్లాపూర్ బంగీయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శారదీయ దుర్గోత్సవం--2026, మూడవ సంవత్సరం గ్రాండ్ పూజ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఉప్పల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరారు. మల్లాపూర్‌లోని V.N.=. గార్డెన్ హాల్--లో నిర్వహించిన ఈ దుర్గోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బంగీయ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ఆకాంక్షించారు.

## తెలంగాణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన జితేందర్‌రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని. ఏ.పి. జితేందర్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వ సహాదారు తెలంగాణా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలు దసరా పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు కలగాలని, రైతులు, కార్మికులు, యువత, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యతను మరింత పెంపొందించాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



## లండన్‌లో ఘనంగా చేనేత బతుకమ్మ, దసరా సంబరాలు

లండన్ వేదికగా తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత బతుకమ్మ- దసరా సంబరాలు అత్యంత వైభవంగా ముగిశాయి. యూకే నలుమూలల నుంచి దాదాపు రెండు వేల మందికి పైగా ప్రవాస భారతీయ కుటుంబాలు సాంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రిటిష్ ఎంపీ రూత్ క్యాడ్బరీ, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, హౌన్స్లో మేయర్ రణ్జిత్ గిల్, కౌన్సిల్ లీడర్ శాంతను రాజావత్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా టీఎస్ఎఫ్డీసీ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, యూకే తెలుగు బిజినెస్ ఛాంబర్ ప్రతినిధి సిక్కా చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో గౌరీపూజలు నిర్వహించి ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. అనంతరం స్వదేశం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శమీ (జమ్మి) వృక్షానికి పూజలు చేసి, ఒకరికొకరు జమ్మి పత్రిని ఇచ్చిపుచ్చుకుంటూ 'అలాయ్-బలాయ్' తీసుకున్నారు. ఉత్తమ బతుకమ్మలను రూపొందించిన మహిళలకు బంగారు నాణేలతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు. చేనేత కార్మికులకు అండగా నిలవాలన్న లక్ష్యంతోనే ప్రతి ఏటా ఈ సంబరాలను చేనేత దినోత్సవ స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, కన్వీనర్ అశోక్ గౌడ్ దూసరి తెలిపారు. విదేశాల్లోనూ మాతృభూమి సంస్కృతిని, చేనేత ప్రాధాన్యతను చాటుతున్న టాక్ కార్యవర్గాన్ని బ్రిటీష్ ప్రజాప్రతినిధులు, అనిల్ కూర్మాచలం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టాక్ ఉపాధ్యక్షులు శుష్మణ రెడ్డి, సురేష్ బుడగం, రాకేష్ పటేల్, ప్రధాన కార్యదర్శులు సుప్రజ పులుసు, శ్రీకాంత్ జెల్లా, సత్యపాల్ రెడ్డి, అడ్వైజరీ బోర్డు చైర్మన్ మట్టారెడ్డి, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ కాలనీలో భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

: అనారోగ్యంతో బాధపడుతు మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్ 4 లో చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ ఎస్సై భానుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 4లోని ఎసఆర్‌టవర్స్‌లోని ఫ్లాట్? నెంబర్304 లో దుంతులూరని రమాదేవి, దంతులూరి వరహాల రాజు(61) నివాసం ఉంటున్నారు. ఇదిలా ఉండగా వరహాల రాజు సోమవారం ఉదయం వాళ్లు నివాసం ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వరహాల రాజు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, మనస్థాపానికి గురి కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని వరహాల రాజు భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

# విజయవంతంగా ముగిసిన సరస్ మేళా

- సరస్ మేళాలో రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు
- మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు భారీ ఆదరణ
- ఆరు లక్షల మంది సందర్శకులు.. 9 కోట్లకు పైగా అమ్మకాలు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**
గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్న సరస్ మేళా ఈ ఏడాది ఘన విజయాన్ని సాధించింది. అక్టోబర్ 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సరస్ మేళాలో రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. మొత్తం 5,98,029 మంది సందర్శకులు మేళాను సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేశారు. హెచ్ఎండిఎ గ్రౌండ్లో 225 స్టాళ్లతో నిర్వహించిన ఈ మేళా మహిళా వ్యాపారులకు మంచి మార్కెట్ వేదికగా నిలిచింది. చివరి నాలుగు రోజుల్లో ప్రతిరోజూ రూ.కోటి కి పైగా అమ్మకాలు జరగడం విశేషం.

### మూడేళ్లలోనే అత్యధిక అమ్మకాలు

సరస్ మేళాలో గత మూడేళ్ల అమ్మకాల గణాంకాలు.. ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాల ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణను చాటుతున్నాయి. 2024లో రూ.7.81 కోట్ల అమ్మకాలు జరగగా, 2025లో రూ.3.28 కోట్ల వ్యాపారం నమోదైంది. ఈ ఏడాది ఏకంగా రూ.9.29 కోట్ల అమ్మకాలు జరిగాయి. 2025తో పోలిస్తే ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగింది. సందర్శకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2025లో 1,69,015 మంది మేళాను సందర్శించగా, ఈ ఏడాది 5,98,029 మంది సందర్శించారు. మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, చేనేత వస్త్రాలు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. అమ్మకాలు ఆశించిన స్థాయిని మించడంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

### మహిళా సాధికారతకు సరస్ మేళా బాటలు

గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం, మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా వినియోగ దారులకు విక్రయించే అవకాశాలను పెంచడం సరస్ మేళా ప్రధాన ఉద్దేశం. మహిళల సంప్రదాయ నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో ఈ మేళా కీలక పాత్ర పోషిస్తోంది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా మహిళలను కేవలం ఉత్పత్తిదారులుగానే కాకుండా, సొంత వ్యాపారాలను నిర్వహించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి వేదికలు దోహదపడుతున్నాయి.

### మహిళలకు మెరుగైన సౌకర్యాలు

మేళాలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామీణాభివృద్ధి శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. వారి వసతి, భోజనం, రవాణా ఖర్చులను శాఖే భరించింది. సందర్శకుల సౌకర్యార్థం సెంట్రలైజ్డ్ ఏసీ ఏర్పాటు చేయడంతో పాటు, పార్కింగ్, భద్రత, ఇతర మౌలిక వసతులను కల్పించారు. మెరుగైన నిర్వహణ, సౌకర్యవంతమైన వాతావరణం కారణంగా సందర్శకుల రాక పెరిగి, అమ్మకాలు కూడా గణనీయంగా వృద్ధి చెందాయి.

### రికార్డు అమ్మకాలపై మంత్రి సీతక్క హర్షం

సరస్ మేళా విజయవంతం కావడం, మహిళా సంఘాల ఉత్పత్తులకు పెద్దఎత్తున ఆదరణ లభించడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించి, వారి కష్టానికి తగిన ఆదాయం సమకూరడం సంతోషకరమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ స్వావలంబన సాధించాలన్నదే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.
సరస్ మేళాను విజయవంతం చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సెర్ప్ సిబ్బందిని మంత్రి అభినందించారు. మహిళల ఉత్పత్తులకు మరింత విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ, వారి ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం నిరంతరం ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు.







## టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 26వ తేదీలలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీ.బీ.టీ.) విధానంలో జరుగనున్న పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 24, 26 తేదీలలో పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏ.వీ. ఎంటర్‌ప్రైజెస్ సెంటర్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 24న అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. 26వ తేదీన కూడా అవే సమయాల్లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో 24వ తేదీ నాటి పరీక్షకు 90 మంది అభ్యర్థులు, 26వ తేదీ నాటి పరీక్షకు 190 మంది హాజరు కానున్నారని తెలిపారు. కాపీయింగ్, లీకేజీలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి ఉదయం 8.00 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని, నిమిషం ఆలస్యమైనా అనుమతించబడరని తెలిపారు. మధ్యాహ్నం రెండో సెషన్ పరీక్షకు సంబంధించి 12.30 గంటల నుంచి లోనికి అనుమతించడం జరుగుతుందని, 2.00 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వంటివి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. పరీక్షా సమయం ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు పరీక్షా కేంద్రం నుంచి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన బంధువులు ఎవరూ పరీక్ష రాయడం లేదని వారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ఏ చిన్నపాటి అవాంతరం, గందరగోళానికి తావు లేకుండా సాఫీగా పరీక్షలు జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే నా ఏకైక లక్ష్యం



### మంత్రి వివేక్ వెంకటస్వామి

: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా ఏకైక లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మున్సిపాలిటీ ప్రాంగణం లో రూ. 1 కోటి నిధులతో నిర్మించనున్న నూతన ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఆధునిక కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ పనులను గడువులోగా పూర్తి చేసి చిరు వ్యాపారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని పలువార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, అవసరమున్న ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని ఆయన అన్నారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని సందర్శించి, వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో వైద్య సేవలు, ఉచిత మందులు, భోజన వసతులపై ఆరా తీశారు. అధికారుల పనితీరును తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన రోగులతో దురుసుగా ప్రవర్తించినా, నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చినా, సరైన చికిత్స అందించకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత లేకుండా చూస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్మన్ నాయక్ వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ నిర్మాణాలు పూర్తి చేయాలి



ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల కాలనీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కాలనీలో నిర్మిస్తున్న 300 ఇందిరమ్మ ఇళ్లతో పాటు అన్ని మౌలిక వసతుల పనులను నవంబర్ 15వ తేదీలోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాలనీని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.
సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలతో ప్రత్యేక నివేదిక రూపొందించి కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తూ, ప్రతి మూడు రోజులకు ఒకసారి పురోగతి నివేదిక అందించాలని సూచించారు. అన్ని ఇళ్లను ఒకే నమూనాలో, ఆకర్షణీయంగా నిర్మించాలని, ఒకే రంగులో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పగలు, రాత్రి పనులు కొనసాగించాలని ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణంతో పాటు విద్యుత్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వెలుగుమట్ల కాలనీని డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. అప్పటిలోగా ఇళ్ల నిర్మాణాలు, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులన్నీ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రారంభోత్సవం సందర్భంగా కాలనీ పేరును ముఖ్యమంత్రి ప్రకటిస్తారని వెల్లడించారు.
వెలుగుమట్లలో గతంలో జరిగిన పరిణామాలను ప్రస్తావించిన మంత్రి.. పేదల పేరుతో కొందరు భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించగా, కోర్టు నిర్ణయం మేరకు జిల్లా యంత్రాంగం ఆక్రమణలను తొలగించిందని తెలిపారు. అదే ప్రాంతంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఇందులో భాగంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. పేదలకు అన్ని సదుపాయాలతో కూడిన ఆదర్శ కాలనీని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. వెలుగుమట్ల కాలనీలో నివాసితులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# కోళ్ల ఫారంలో డ్రగ్స్ తయారీ..



తెలంగాణ, మహారాష్ట్ర కేంద్రాలుగా సాగుతున్న భారీ అంతర్రాష్ట్ర సింథటిక్ డ్రగ్స్ తయారీ, అక్రమ రవాణా రాకెట్‌ను తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఛేదించింది. మహారాష్ట్రలోని గోండియా జిల్లా తిరోడా తాలూకా మారేగావ్ గ్రామ పరిధిలోని ఓ కోళ్ల ఫారంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని అధికారులు గుర్తించి బట్టబయలు చేశారు. ఈ భారీ డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలు ఆగస్టు 8న బీబీనగర్ పోలీసుల తనిఖీల్లో వెలుగుచూశాయి. కొండమడుగు నుంచి నాగ్‌పూర్ వెళ్తున్న ఓ ఫార్చ్యూనర్ కారును తనిఖీ చేయగా.. అందులో రూ. కోట్ల విలువైన 27.2 కేజీల మెఫెడ్రోన్, 56.98 కేజీల ఎసిటోన్ దొరికాయి. దీంతో కారులోని చేతన్ మధుకర్, ముజమ్మిల్ హోక్, ఆకాశ్ అశోక్ గవాండేలను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అంతర్రాష్ట్ర మూలాలు ఉండటంతో విచారణను ఈగల్ ఫోర్స్‌కు అప్పగించారు. విచారణలో తెలంగాణలోని కొండమడుగు వేటుకూరి ల్యాబ్స్, మౌలాలీలోని ఎస్ఎం ల్యాబ్స్‌తో పాటు మహారాష్ట్రకు బలమైన లింకులు ఉన్నట్లు తేలింది. దర్యాప్తును వేగవంతం చేసిన ఈగల్ ఫోర్స్ బృందాలు.. అక్టోబర్ 17న మహారాష్ట్రలోని మారేగావ్‌లో ఉన్న ఓ పౌల్ట్రీ ఫారంలో ఆకస్మిక సోదాలు నిర్వహించాయి. కోళ్ల ఫారం ముసుగులో భారీ ఎత్తున రసాయన ప్రాసెసింగ్ పరికరాలను ఏర్పాటు చేసి మెఫెడ్రోన్, అల్ప్రాజోలం, ఎఫిడ్రిన్ వంటి ప్రమాదకర సింథటిక్ మత్తుపదార్థాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు.
ఘటనా స్థలంలో రసాయనాల అవశేషాలు, ప్రత్యేక యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తయారీకి కీలకమైన ప్రొపియోనైల్ క్లోరైడ్ అనే ముడి రసాయనాన్ని సరఫరా చేస్తున్న మహారాష్ట్రలోని వసయ్‌కు చెందిన జేఎస్‌వీ గ్లోబల్స్ యజమాని జైరాజ్ కృష్ణ శెట్టిని ఈగల్ ఫోర్స్ ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకుని తెలంగాణకు తరలించింది. అతనితో పాటు అస్సాంకు చెందిన సద్దాం హుస్సేన్‌ను కూడా అరెస్ట్ చేశారు. వేటుకూరి ల్యాబ్స్ యజమాని పెనుమత్స రాకేష్ వర్మను గతంలోనే ఎన్‌సీబీ ఇండోర్ విభాగం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. ఈ మొత్తం నెట్‌వర్క్‌లో ఇప్పటి వరకు 11 మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాయి. కాగా, అస్సాం, మహారాష్ట్ర, రాజస్థాన్, హైదరాబాద్‌కు చెందిన మరో 13 మంది కీలక నిందితులు పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

### ఆరు నెలల తర్వాత

# ఉపసంఘం ఏర్పాటు చేయడమా?

- ఎల్‌నినో సంక్షోభం ప్రభుత్వ నిర్లక్ష్యమే
- రూ.20 వేల కోట్ల అత్యవసర బడ్జెట్‌కు దాసోజు డిమాండ్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19 :** రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. సంక్షోభంపై ముందస్తు చర్యలు తీసుకోకుండా, వర్షాకాలం ముగిసిన తర్వాత మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని మండిపడ్డారు. జీవో నంబర్ 1523 ద్వారా ఏర్పాటైన ఉపసంఘానికి 15 రోజుల గడువు విధించాలని, తక్షణమే శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రూ.20 వేల కోట్ల అత్యవసర అనుబంధ బడ్జెట్ ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి, ఉపసంఘం సభ్యులకు రాసిన బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. ఏప్రిల్‌లోనే ఎల్‌నినో ముప్పుపై హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో ప్రాణహిత జలాలను వినియోగించకుండా వృథాగా వదిలేశారని విమర్శించారు. విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడంలో విఫలమై అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని, తాగునీటి కోసం జిల్లాలకు రూ.కోటి కేటాయించడం సరిపోదన్నారు.

**రైతులకు పరిహారం చెల్లించాలి...**

పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఎకరాకు నిర్దిష్ట పరిహారం ప్రకటించాలని, ప్రత్యామ్నాయ పంటలకు ఉచిత విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. కరువు నివారణకు ఖర్చు చేసిన నిధులు, నీటి వినియోగం, విద్యుత్ కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించకుండా రాష్ట్రాన్ని కరువు కోరల్లోకి నెట్టిన ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

### హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత

# సందడిగా బతుకమ్మ ఆటలు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19 :** దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ ఆటలకు హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులు వేదికలయ్యాయి. కూకట్‌పల్లి నల్లచెరువుతో పాటు.. ఐడీఎల్ చెరువు, మాధాపూర్‌లోని సున్నం చెరువు, అంబర్‌పేట బతుకమ్మకుంట, ఉప్పల్ నల్లకుంట చెరువుల వద్ద పెద్దమొత్తంలో మహిళలు బతుకమ్మ ఆటలాడారు. కూకట్‌పల్లి నల్లచెరువులోని బేబీపాండ్‌ను నీటితో నింపడంతో అందులో బతుకమ్మలను వదిలి సందడి చేశారు. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో గణేష్ నిమజ్జనాలకోసం ప్రత్యేకంగా తవ్విన చెరువు వైపు బతుకమ్మ ఆటలు జోరుగా సాగాయి. ఇదే పరిస్థితి అంబర్‌పేటలోని బతుకమ్మకుంటతో పాటు.. ఉప్పల్ నల్ చెరువులో కూడా బతుకమ్మ ఉత్సవాల సందడి కనిపించింది. కూకట్‌పల్లి నల్ల చెరువులో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించడమే కాకుండా.. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా.. బతుకమ్మలను తీసుకుని చెరువులో వదిలారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక చెరువుల్లో నీరు లేని పరిస్థితుల్లో హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో మహిళలకు ఎంతో ఊరట లభించింది. గతంలో చెరువుల చెంత బతుకమ్మ ఆడడానికి అనువైన వతావరణం ఉండేది కాదు.. కేవలం వాటిని గంగలో వదలడానికే పరిమితమయ్యేవారం.. ఇప్పుడు హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులు వేదికలయ్యాయని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. చెరువు చెంత బతుకమ్మ ఆటలాడడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# రైతులు ఆచితూచి పంటలు వేయాలి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:** ప్రజలంతా సంతోషంగా దసరా పండుగను జరుపుకోవాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆకాంక్షించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంటల సాగు విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఎల్‌నినోను ప్రభుత్వం సృష్టించిన సమస్యగా చూడకూడదని, ఇప్పటివరకు 18 సార్లు ఎల్‌నినో సంభవించిందని పేర్కొన్నారు. సుమారు 150 ఏళ్ల క్రితం కూడా ఇలాంటి సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా 13 కోట్ల మంది పేర్లను తొలగించారని ఆరోపించారు. ఈ ప్రక్రియ కోసం పెద్ద ఎత్తున అధికారులను నియమించారని పేర్కొన్నారు. ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ అసలు ఉద్దేశమని చెబుతున్నప్పటికీ, బీజేపీ వ్యతిరేక ఓట్లను మాత్రమే తొలగిస్తున్నారని విమర్శించారు. పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని మల్లు రవి కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

- మక్తల్‌కు సాగునీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మక్తల్--నారాయణపేట రోడ్డు వెడల్పు పనులు వెంటనే చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**నారాయణపేట, వెలుతురు అక్టోబర్ 19, :** నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ చెరువు విస్తరణ, కట్ట ఎత్తు పెంపు ప్రతిపాదనలతో గ్రామానికి ముంపు ప్రమాదం పొంచి ఉందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఊట్కూర్‌ను వెంటనే ముంపు గ్రామంగా ప్రకటించి, ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎత్తిపోతల పథకం ద్వారా మక్తల్ నియోజకవర్గంలో ఎన్ని చెరువులను నింపుతున్నారు, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించనున్నారు అనే వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని రామ్మోహన్ రెడ్డి కోరారు. కొడంగల్‌కు సాగునీరు అందించే క్రమంలో మక్తల్ నియోజకవర్గం నీటితోపాటు భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. మరోవైపు, మక్తల్--నారాయణపేట ప్రధాన రహదారి దుస్థితిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధిని డిమాండ్ చేస్తూ 30 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గుంతల కారణంగా వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం సకాలంలో చేరుకోలేకపోతున్నాయని పేర్కొన్నారు. రహదారి పనులకు రూ.237 కోట్లతో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. నాలుగు నెలల క్రితం 170 గుంతలు ఉన్నాయని చెప్పగా, మంత్రి సీతక్క పర్యటన సమయానికి వాటి సంఖ్య 700కు చేరిందని తెలిపారు. అయినప్పటికీ గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రహ్మాన్, తరుణ్, ఆనంద్ రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కోరం శివారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.





# సోమనాథ క్షేత్రంలో చండీయాగం

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 19:** శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చౌటుప్పల్ లోని శ్రీ సోమనాథ క్షేత్రంలో అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దని దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా శ్రీ సోమ నాథ క్షేత్రంలో చండీ హోమం ప్రత్యేకంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. అమ్మవారికి అలంకరించి నవ రాత్రులు పూజలు అందుకున్న చీరలను, లడ్డూను భక్తులు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ క్షేత్రం చౌటుప్పల కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ మాట్లాడుతూ, సోమనాథ తత్వాన్ని వివరించారు. మనోయోగ సాధన చేయాలని భక్తులను కోరారు. మాజీ మార్కెట్ చైర్మన్ బడుగు మాణిక్యం, ముగుదాల రమేష్ గౌడ్, క్షేత్ర కమిటీ గౌరవాధ్యక్షుడు అప్పిడి రామిరెడ్డి కార్యదర్శి గట్టు ప్రభాకర్, రవీందర్, డాక్టర్ వేముల నరసింహ యమునా, కృష్ణమాచారి, గణేష్, భాస్కర్ పాల్గొన్నారు.





# క్రీడాకారిణికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆర్థిక సహాయం



**చౌటుప్పల్, వెలుతురు అక్టోబర్ 19:** నిరుపేద కుటుంబం లో పుట్టి స్వశక్తి తో ఎదుగుతున్న క్రీడాకారిణి కి ఆర్థిక సహాయం చేసిన దైవ సమానులు రాజగోపాల్ రెడ్డి గారు...ఎస్ జి ఎఫ్ ఐ స్కూల్ గేమ్ ఫ్రీడేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ టైక్వాండో గేమ్స్ జమ్మూ కాశ్మీర్ శ్రీనగర్ లో నిర్వహిస్తున్న నేషనల్స్ కి చౌటుప్పల్ మున్సిపల్ 14 వ వార్డు కు చెందిన నియోజిత అనే క్రీడాకారిని సెలెక్ట్ కావడం జరిగింది వాళ్ల ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనందున స్థానిక కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ ల సహకారం తో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లడం తో స్పందించిన మునుగోడు దాన కర్ణుడు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అడిగిన వెంటనే ఆ క్రీడాకారిని కి 50వేల రూపాయలు తక్షణ సహాయం అందజేయడం జరిగింది.

# జీవో 98 రద్దుపై గిరిజన కమిషన్ విచారణ

- మున్నేరు--పాలేరు అనుసంధాన కాలువ నిలిపివేతపై ఫిర్యాదు
- ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రత్యేక విచారణ
- పూర్తి ఆధారాలతో హాజరుకావాలని ఉన్నతాధికారులకు నోటీసులు


राष्ट्रीय अनुसूचित जनजाति आयोग
National Commission for Scheduled Tribes
(A constitutional body under Article 338A of the Constitution of India)

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19 :** జీవో నంబర్ 98 రద్దు, ప్రతిపాదిత మున్నేరు--పాలేరు అనుసంధాన కాలువ ప్రాజెక్టు నిలిపివేతకు సంబంధించిన ఫిర్యాదుపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్టీ) విచారణ చేపట్టనుంది. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది విశ్వ జంపాల సమర్పించిన ఫిర్యాదుపై స్పందించిన కమిషన్ ఈ నెల 26న ప్రత్యేక విచారణ నిర్వహించేందుకు నిర్ణయించింది. కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2.20 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సమీపంలోని దిల్‌కుషా అతిథి గృహంలో విచారణ జరగనుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, డైరెక్టర్‌తో పాటు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు కమిషన్ నోటీసులు జారీ చేసింది. సంబంధిత కేసు పూర్వాపరాలు, అసలు రికార్డులు, పూర్తి ఆధారాలతో విచారణకు స్వయంగా హాజరుకావాలని ఆదేశించింది. విచారణకు అధికారులు గైర్హాజరైతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ క్లాజ్ (8) ప్రకారం సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలను వినియోగించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ విచారణలో ఫిర్యాదుదారుడు విశ్వ జంపాల పాల్గొని బాధితుల తరఫున వాదనలు వినిపించనున్నారు.



# దేశంలోని జిల్లాల్లో ఏఐపీసీ కమిటీలను ఏర్పాటు చేస్తాం

- పదవి గా కాకుండా బాధ్యతగా భావిస్తున్నాను...
- ఏఐపీసీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కీ గౌడ్
- వీడియో కాల్ ద్వారా సందేశం అందించిన సామ్ పిట్రోడా





**న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 19:** ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సోమవారం రోజున ఢిల్లీలోని ఏఐసీసీ భవన్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏఐపీసీ మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి గారి నుంచి మధుయాష్కి గారు బాధ్యతలు స్వీకరించారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ దీపాదాస్ మున్షి గారు, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఏఐసీసీ ఇన్చార్జ్ రాజ్ పాల్ గౌతమ్ గారు, జఔజ మెంబర్స్ గురుదీప్ సింగ్ సప్పాల్ గారు, జఔజ సభ్యులు, రాజ్యసభ ఎంపీ దీపేందర్ హుడా గారు, మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ గారు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కి గారు మాట్లాడుతూ.. ఏఐపీసీ చైర్మన్ గా నియమించడాన్ని పదవిగా చూడటం లేదని.. తన బాధ్యతగా భావించి పనిచేస్తానని వివరించారు. దేశవ్యాప్తంగా 50 వేల సభ్యత్వంతో.. అభివృద్ధి చెందిన 100 అర్బన్ జిల్లాల్లో ఏఐపీసీ కమిటీలను విస్తరించేలా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. అంబేద్కర్ గారు సూచించిన బోధించు, సమీకరించు పోరాడు అనే సూత్రంతో ఏఐపీసీ ని నడిపిస్తానని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం మోడీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న తీరు, ప్రజాస్వామ్యం విలువలు మంట కలుపుతున్న తీరుకు వ్యతిరేకంగా ప్రొఫెషనల్స్ ను భాగస్వామ్యం పెంచేలా పనిచేస్తామన్నారు. రాహుల్ గాంధీ గారి విజన్ కు అనుగుణంగా డెమొక్రటిక్ వాల్యూస్ ను దేశంలో పెంపొందించేందుకు ఏఐపీసీ తగిన పాత్ర పోషించేలా కృషి చేస్తామన్నారు. రాహుల్ గాంధీ గారు కోరుకుంటున్నట్లుగా భిన్నత్వంలో ఏకత్వం నకొనసాగుతూ.. దేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదమైన జీవనం సాగించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యమని, ఆ దిశగా పౌర సమాజం, ఏఐపీసీ కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి గారు దేశంలో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో నందన్ నిలేకని గారితో కలిసి పనిచేశారని గుర్తు చేశారు. ఏఐపీసీ మొదటి చైర్మన్ శశిథరూర్ గారు, ఆ తర్వాత ప్రవీణ్ చక్రవర్తి గారు సమర్థవంతంగా పని చేసి ఏఐపీసీ ని బలోపేతం చేశారని వివరించారు. పార్టీ పాలసీ నిర్మాణంలోనూ, దేశ అభ్యున్నతి కోసం రూపొందించే పాలసీలోనూ ప్రొఫెషనల్స్ పాత్రను పెంచుతామన్నారు. ప్రవీణ్ చక్రవర్తి గారు మాట్లాడుతూ.. ప్రొఫెషనల్స్ రాజకీయ రంగంలోకి రాకుండా దూరంగా ఉంటే.. దేశం ఉన్నతమైన విలువలతో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. ప్రొఫెషనల్ అనుభవం, ఆలోచనలు దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ కు తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లుగా మరే రాజకీయ పార్టీలోనూ లేదన్నారు. అర్బన్ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నప్పుడే జాతీయ స్థాయిలో అధికారంలోకి వచ్చిందని.. అర్బన్ ప్రాంతాలలోనే నివసించే ప్రొఫెషనల్స్ ను ఒక వేదికపై తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మధుయాష్కి గారు తనకు పాత మిత్రుడని.. అతను సమర్థవంతంగా పనిచేసి బలోపేతం చేస్తాడన్న నమ్మకం ఉందని వివరించారు. గురుదీప్ సింగ్ సప్పల్ గారు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ హాయంలో కార్పొరేట్ల ఆదాయం నాలుగింతలు కాగా.. ఆ కార్పొరేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల జీతాలు మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హాయంలో ప్రైవేటు సంస్థలు పనిచేసే ఉద్యోగులకు జీతాలు ప్రతి సంవత్సరం క్రమ పద్ధతి లో పెరిగేవని.. కానీ మోడీ ప్రభుత్వ హాయంలో ఐటీ ఉద్యోగుల జీతాలు దశాబ్ద కాలంగా అంతే ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో దేశంలో అన్ని వర్గాలు సంక్షేమం సంతోషంగా ఉండాలని వివరించారు. మోడీ ప్రభుత్వ హాయంలో అన్ని వ్యవస్థలు నాశనం అవుతున్న తీరును అడ్డుకునే క్రమంలో ప్రొఫెషనల్ పాత్ర ఎంతో కీలకమన్నారు. దీపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. అన్ని రకాల వనరులున్న మన దేశం.. సూపర్ శక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని.. కానీ 12 ఏళ్ల మోడీ ప్రభుత్వమే హాయంలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, సాఫ్ట్వేర్ రంగాలతో పాటు వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులను ఏఐపీసీ ద్వారా ఒక వేదికపై తీసుకురావాలని సూచించారు. ఉత్తర భారతదేశంలో ఏఐపీసీ ని మరింత విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పెట్రోడ గారు.. వీడియో కాల్ ద్వారా మధుయాష్కి గారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం అనంతరం దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే క్రమంలో నాటి ప్రధాని నెహ్రూ గారు.. వివిధ రంగాల్లోని నిపుణులను గుర్తించి ప్రోత్సహించారని వివరించారు. దేశంలో ఇండస్ట్రియల్, ఎయిర్, నేవీ, ట్రాన్స్పోర్ట్ హాస్పిటల్స్, రైల్వేస్, అగ్రికల్చర్ రంగాలను అభివృద్ధి చేసేందుకు నెహ్రూ గారు ఎంతో శ్రమించారన్నారు. ప్రతి రంగంలోని డేటాను సేకరించడంలో, అందుకు అనుగుణంగా దేశంలో అభివృద్ధిని, నూతన ప్రణాళికను రచించడానికి ప్రొఫెషనల్స్ ఎంతో అవసరం అన్నారు. దేశంలోని అన్ని జిల్లాల్లోనూ ఏఐపిసి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అందులో డాక్టర్స్, టీచర్స్, సైంటిస్ట్ ఇంజనీర్స్ ఇలా అన్ని రంగాల నిపుణులను భాగస్వామ్యం చేయాలన్నారు. దేశ నిర్మాణంలో ప్రొఫెషనల్స్ ను కీలక భాగస్వామ్యం చేయాలని సూచించారు. రాజుపాల్ గౌతమ్ గారు మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో లక్షలాదిమంది పాల్గొని తమ జీవితాలను త్యాగం చేశారని, అ త్యాగాల చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. అనేక సంస్కృతులకు నిలయమైన భారతదేశంలో నేడు విభజన రాజకీయాలతో ప్రజాస్వామ్య రాజ్యాంగ హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే సహకారంతో మొదటి మహిళా పాఠశాల పూణేలో నెలకొల్ప బడిందని.. తొలి దళిత పాఠశాల కూడా అక్కడే ప్రారంభమైందన్నారు. దేశంలో అన్ని వర్గాల వారికి చదువు, అవకాశాల పాటు వ్యాపార వాణిజ్య రంగాల్లోనూ ప్రోత్సహించిన చరిత్ర కాంగ్రె స్ దన్నారు. కానీ మోడీ ప్రభుత్వం కొందరి కార్పొరేట్లనే ప్రోత్సహిస్తుందని విమర్శించారు. అన్ని రంగాల్లోని డేటాను సేకరించి.. సమాజ అభివృద్ధికి సరైన మార్గ నిర్దేశనం ఏఐపీసీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా రూపొందించిన ఏఐపీసీ పాటను దీపా దాస్ మున్షీ గారు విడుదల చేశారు..

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు

### ముగ్గురు నిందితులు అరెస్ట్




**జైపూర్, వెలుతురు, అక్టోబర్ 19:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్పై కాల్పుల ఘటనలో కీలక పరిణామం జరిగింది. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు నిందితులను రాజస్థాన్‌లోని కోటాలో పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుల్లో ఇద్దరు హరియాణా వాసులు కాగా, మరొకరు బిహార్ వాసి. ఈ ముగ్గురు రైలు ప్రయాణిస్తుండగా కోటా నగర పోలీసులు పట్టుకున్నారని ఎస్పీ తేజస్విని గౌతమ్ మీడియాకు చెప్పారు. ఈ నిందితుల్లో మైనర్ కూడా ఉండడం గమనార్హం. హరియాణాకు చెందిన రెహాన్ అలియాస్ సుక్కా, బిహార్‌కు చెందిన హృతిక్ కుర్మీ అలియాస్ రోషన్, ఒక మైనర్ను ముంబయి పోలీసులకు అప్పగించనున్నట్లు ఎస్పీ తేజస్విని గౌతమ్ తెలిపారు. ఈ ముగ్గురికి కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పుణె- జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా కోటా నగర పోలీసులు రైల్వే స్టేషన్‌లో ఈ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ గౌతమ్ తెలిపిన ప్రకారం, నిందితులు దిల్లీకి వెళ్లి అక్కడ్నుంచి నేపాల్‌కు పారిపోవాలని ప్రణాళిక వేసినట్లు చెప్పారు. ఉదయం 9:45 గంటల ప్రాంతంలో నిందితుల గురించి పోలీసులకు సమాచారం అందిందని, వారిని పట్టుకోవడానికి రైల్వే స్టేషన్లో పోలీసు బృందాలు గాలించాయని వెల్లడించారు

## లండన్‌లో ఘనంగా 'టాక్ - చేనేత బతుకమ్మ-దసరా'

- రెండు వేల మందికి పైగా ప్రవాస తెలంగాణ కుటుంబాల హాజరు
- ప్రత్యేక అతిథిగా టీజీఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం



**లండన్ వెలుతురు, అక్టోబర్ 19:** తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో నిర్వహించిన 'చేనేత బతుకమ్మ--దసరా' సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. యూకే నలుమూలల నుంచి రెండు వేల మందికి పైగా ప్రవాస తెలంగాణ కుటుంబ సభ్యులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై చాటిచెబుతూ, చేనేతకు చేయూతనిచ్చే లక్ష్యంతో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రిటన్ పార్లమెంట్ సభ్యురాలు రూత్ క్యాడ్‌బరీ, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, హౌన్స్లో మేయర్ రఘ్జిత్ గిల్, హౌన్స్లో కౌన్సిల్ నాయకుడు శాంతను రాజావత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. యూకే తెలుగు బిజినెస్ ఛాంబర్ నాయకుడు సిక్కా చంద్రశేఖర్ గౌడ్‌తో పాటు పలువురు ప్రవాస సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**చేనేతకు చేయూతనివ్వడమే లక్ష్యం**

టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ నాయకత్వంలో చేనేత రంగానికి అండగా పలు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అదే స్ఫూర్తితో, మాజీ మంత్రి కేటీఆర్ కృషిని కొనసాగిస్తూ చేనేత కార్మికులకు చేయూతనివ్వాలనే సామాజిక బాధ్యతతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న బతుకమ్మ, దసరా వేడుకలను ఈసారి 'చేనేత బతుకమ్మ--దసరా'గా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.

**తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటుతున్న ప్రవాసులు**

ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యూకేలో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులు సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటూ, విదేశాల్లోనూ తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం అభినందనీయమని అన్నారు. టాక్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. లండన్ బహుళ సంస్కృతులకు నిలయమని, పరస్పర సంప్రదాయాలను గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. స్థానికంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**తెలంగాణ ఆడబిడ్డలకు అనిల్ కూర్మాచలం బతుకమ్మ శుభాకాంక్షలు**

టీజీఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముందుగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. లండన్ గడ్డపై తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసి, రాజకీయాలకు అతీతంగా సామాజిక వేదికపై నిరంతరం సేవలందిస్తున్న టాక్ కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. వేడుకలకు హాజరై విజయవంతం చేసిన ప్రవాస కుటుంబ సభ్యులకు, అతిథులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. టాక్ ఉపాధ్యక్షురాలు శుష్మన రెడ్డి మాట్లాడుతూ, సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రవాస తెలంగాణ సమాజం విజయవంతం చేస్తూ టాక్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తోందన్నారు. ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు మాట్లాడుతూ, తమ పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో ప్రవాసులు చేనేత వస్త్రాలు ధరించి వేడుకలకు హాజరుకావడం ఎంతో సంతోషాన్ని, స్ఫూర్తిని ఇచ్చిందన్నారు.

**సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పూజలు.. ఘనంగా అలాయ్--బలాయ్**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో మహిళలు రంగురంగుల బతుకమ్మలను తీసుకొచ్చి గౌరీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, చప్పట్లు కొడుతూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విదేశాల్లో స్థిరపడినప్పటికీ తెలంగాణ ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడటం, చిన్నారులు సైతం చిన్న చిన్న బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టాక్ కమ్యూనిటీ అఫైర్స్ చైర్‌పర్సన్ గణేష్ కుప్పాల మాట్లాడుతూ, దసరా సందర్భంగా స్వదేశం నుంచి తీసుకొచ్చిన శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అలాయ్--బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత శాలువాలను పరస్పరం కప్పుకొని, జమ్మి ఆకులను బంగారంగా భావించి ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. చేనేత వస్త్రాలను వీలైనన్ని సందర్భాల్లో ధరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. లండన్‌లో తెలంగాణ సంప్రదాయమైన అలాయ్--బలాయ్ ఆత్మీయతను చాటిచెప్పిన ఈ కార్యక్రమాన్ని పలువురు ప్రశంసించారు.



# మహిళా సంఘాలకు మొండిచేయి..

- కాంగ్రెస్ కార్యకర్తలకు వేరుశనగలా?
- డబ్బులు వసూలు చేసి.. పంపిణీ వేళ చేతులెత్తేసిన అధికారులు..?
- అంకూర్‌లో మహిళల ఆగ్రహం.. బొడ్డెమ్మలతో రోడ్డుపై నిరసన.. రాస్తారోకో
- మహిళలకు అందాల్సిన విత్తనాలు ఎవరికి చేరాయి?





**వనపర్తి, వెలుతురు అక్టోబర్19:** మహిళా సంఘాల పేరుతో డబ్బులు వసూలు చేసి విత్తనాలు పంపిణీ సమయానికి మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన మహిళలకు అందాల్సిన వేరుశనగ విత్తనాలుతమకు తెలియకుండానే కాంగ్రెస్ కార్యకర్తలకు పంపిణీ చేస్తున్నారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి మండలం అంకూర్ గ్రామంలో వనపర్తి,మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై బొడ్డెమ్మలతో వినూత్నంగా నిరసన చేపట్టివాహనాలను అడ్డుకుని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

**-రూ. 500 చెల్లించాం.. మరో రూ. 200 కూడా ఇచ్చాం!**

మహిళా సంఘాలకు పిండి, విత్తనాలు అందిస్తామని చెప్పడంతో ఒక్కొక్కరం రూ. 500 చొప్పున చెల్లించామని మహిళా సంఘం అధ్యక్షురాలు తెలిపారు. అనంతరం పాస్‌బుక్, ఆధార్ కార్డుల జిరాక్స్‌ల కోసం మరో రూ. 200 చొప్పున చెల్లించామని పేర్కొన్నారు. ఇంత చేసినా తమకు అందాల్సిన విత్తనాల పంపిణీలో పారదర్శకత కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు వసూలు చేసే సమయంలో ముందున్న వారు లబ్ధిదారులకు విత్తనాలు అందించే సమయంలో మాత్రంబాధ్యత నుంచి తప్పించుకుంటున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**-విత్తనాలు ఎవరికి ఇచ్చారు? అధికారుల సమాధానం ఏది?**

మహిళా సంఘాలకు సమాచారం ఇవ్వకుండానే కొందరికి వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే తమకు తెలియదని చెబుతున్నారని మండిపడుతున్నారు. విత్తనాల పంపిణీ వంటి కీలకమైన కార్యక్రమంపై సంబంధిత అధికారులకే స్పష్టత లేకపోతే పర్యవేక్షణ ఎక్కడ జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించాల్సిన అధికారులు, లబ్ధిదారుల ఎంపిక నుంచి పంపిణీ వరకు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారా? మహిళలకు అందాల్సిన విత్తనాలు ఎవరికి, ఏ ప్రాతిపదికన పంపిణీ చేశారో స్పష్టంచేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**-గ్రామంలో ప్రజాప్రతినిధులు కనిపించడం లేదా?**

గ్రామంలో మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు, ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీవారిని సంప్రదించకుండా పంపిణీ ఎలా చేపడతారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన మహిళలను పక్కనపెట్టి రాజకీయ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే విత్తనాల పంపిణీలో నిజంగారాజకీయ జోక్యం జరిగిందా? నిబంధనల ప్రకారమే పంపిణీ చేశారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**-బొడ్డెమ్మలతో నిరసన.. అధికారులకు చెంపపెట్టు!**

తెలంగాణ సంస్కృతిలో భాగమైన బొడ్డెమ్మలను నిరసన వేదికగా మార్చుకుని మహిళలు రోడ్డెక్కడం అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తికి అద్దం పడుతోంది. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మహిళలు ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డుకుని ఆందోళన చేపట్టడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మహిళా సంఘాల సమస్యలను పరిష్కరించాల్సిన యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు ఈ ఘటనతో మరింత బలపడుతున్నాయి.

**-మహిళలకు బీఆర్ఎస్ సంఘీభావం**

మహిళలు చేపట్టిన నిరసనకు బీఆర్ఎస్ నాయకులు కె. మాణిక్యం, రవిప్రకాష్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, మాధవ్ రెడ్డి, చిట్యాల రాము తదితరులు సంఘీభావం తెలిపారు. మహిళలకు మద్దతుగా నిలిచి వారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**-అధికారులు సమాధానం చెప్పాల్సిందే!**

మహిళల నుంచి డబ్బులు ఎందుకు వసూలు చేశారు? విత్తనాల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల జాబితా ఎక్కడుంది? అంకూర్ గ్రామంలో ఎవరెవరికి వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు? మహిళా సంఘాలకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రజాధనంతో, ప్రభుత్వ పథకాలతో ముడిపడిన పంపిణీ కార్యక్రమాల్లో జవాబుదారీతనం తప్పనిసరి. మహిళల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పంపిణీ వివరాలను బహిర్గతం చేయడంతో పాటు అర్హులైన వారికి న్యాయం చేయాలనీ గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయో లేదో తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది





## తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దసర శుభాకాంక్షలు

### మల్టి జోన్ 1 ఐజి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 20** ప్రజలందరికీ తెలంగాణ మల్టీ జోన్ 1 ఐజి ఎస్ ఎస్ చంద్రశేఖర్ రెడ్డి దసర పండుగా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందోత్సాహాలతో గడపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకోవాలని ఐజి కోరారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు తెలంగాణ పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవిస్తూ, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బెట్టింగ్‌లు, జూదం, గొడవలు, తగాదాలకు దూరంగా ఉంటూ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సంగారెడ్డిలో దసరా వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 20 : సంగారెడ్డి లో సద్దుల బతుకమ్మ సంబురాలు ముగిశాయి.. ఇక దసరా ఉత్సవాల సందడి మొదలైంది. బతుకమ్మ వేడుకలతో పూల పరిమళాలు వెదజల్లిన సంగారెడ్డి పట్టణం ఇప్పుడు విజయదశమి వేడుకలకు ముస్తాబవుతోంది. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కింది బజార్ పెద్ద చెరువు కట్టపై బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా ముగియగా అంబేద్కర్ స్టేడియంలో దసరా వేడుకలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కింది బజార్ చెరువు కట్టపై ఎనిమిది టన్నుల పూలతో ఏర్పాటు చేసిన 32 అడుగుల మహా బతుకమ్మ, ఆరు వేదికలపై మహిళల ఆటపాటలు, కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాది మంది మహిళల సందడితో బతుకమ్మ సంబురాలు ముగిశాయి.

**దసరా ఏర్పాట్లపై జగ్గారెడ్డి ప్రత్యేక దృష్టి**

సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న దసరా వేడుకల ఏర్పాట్లను సోమవారం రాత్రి జగ్గారెడ్డి స్వయంగా పరిశీలించారు. స్టేడియం అంతటా కలియతిరుగుతూ వేదిక నిర్మాణం, సౌండ్ సిస్టమ్, ప్రేక్షకుల సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన వేదిక ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు వివరించారు. సామాన్య ప్రజలు సైతం కార్యక్రమాలను సౌకర్యవంతంగా వీక్షించేలా సీటింగ్ ఉండాలని సూచించారు.








# ఫ్రాన్స్ నుంచి అమెరికా వరకు ప్రజాగ్రహ జ్వాలలు!

- 8 దేశాల్లో నిరసనల సెగ.. హింసాత్మకంగా మారుతున్న ఆందోళనలు
- ధరల భారం.. విద్యా సంక్షోభం.. నిరుద్యోగంపై రగులుతున్న యువత
- ఫ్రాన్స్‌లో విధ్వంసం.. అల్బేనియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం
- అమెరికాలో 'నో కింగ్స్' నినాదం.. అర్జెంటీనాలో విద్యార్థుల పోరు
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అసంతృప్తి




**డిజిటల్ న్యూస్, వెలుతురు, అక్టోబర్ 19 :**

పారిస్ నుంచి లిస్బన్ వరకు.. బ్రస్సెల్స్ నుంచి బ్యూనస్ ఎయిర్స్ వరకు.. ప్రజాగ్రహం వీధుల్లోకి వస్తోంది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇళ్ల అద్దెల భారం, నిరుద్యోగం, విద్యారంగంలో నిధుల కోతలు, ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకతతో పలు దేశాల్లో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. అక్టోబర్ 17న ఫ్రాన్స్, బెల్జియం, పోర్చుగల్, ఇటలీల్లో పెద్దఎత్తున నిరసనలు జరగ్గా.. అల్బేనియాలోనూ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. మరోవైపు అర్జెంటీనాలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలని విద్యార్థులు, అధ్యాపకులు పోరుబాట పట్టారు. అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ 'నో కింగ్స్' ప్రదర్శనలు జరిగాయి. కారణాలు, డిమాండ్లు వేర్వేరైనా.. పాలకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి పలు ఉద్యమాల్లో ప్రధానంగా కనిపిస్తోంది.

## ఫ్రాన్స్‌లో అదుపుతప్పిన ఆందోళనలు

ఫ్రాన్స్‌లో విద్యార్థుల సమస్యలతో మొదలైన నిరసనలు జీవన వ్యయ సంక్షోభం, ప్రభుత్వ సేవల క్షీణతపై ప్రజాగ్రహంగా విస్తరించాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, సరైన వసతులు లేకపోవడం, విద్యారంగానికి నిధుల కేటాయింపుపై అసంతృప్తి ఆందోళనలకు ఆజ్యం పోశాయి. దీనికి తోడు ఇంధనం, ఆహార ధరల పెరుగుదల, కుటుంబాలపై ఆర్థిక భారం ప్రజలను వీధుల్లోకి తీసుకొచ్చాయి.

శనివారం దేశవ్యాప్తంగా జరిగిన ప్రదర్శనల్లో ఐదు లక్షల మందికిపైగా పాల్గొన్నట్లు అధికారిక అంచనాలు వెల్లడించాయి. పారిస్, మార్సెయి, లియోన్, బోర్డో తదితర నగరాల్లో నిరసనలు జరిగాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దుకాణాలపై దాడులు, లూటీలు, వాహనాలకు నిప్పంటించడం, ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. లిమోజెస్ నగరంలోని చారిత్రక నగరపాలక సంస్థ భవనం అగ్నికి ఆహుతైంది. పోలీసులు బాష్పవాయువు, నీటి ఫిరంగులను ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. హింసకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రభుత్వం హెచ్చరించింది. వచ్చే ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచుతున్నాయి.

## బెల్జియంలో విద్యార్థుల ఆగ్రహం

ఫ్రాన్స్ పొరుగుదేశమైన బెల్జియంలోనూ జీవన వ్యయం, విద్యా సంస్కరణలపై నిరసనలు వెల్లువెత్తాయి. బ్రస్సెల్స్‌లో విశ్వవిద్యాలయ ప్రవేశ, నమోదు రుసుములు, విద్యా విధానాల్లో మార్పులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేపట్టారు. నిరసనకారులు కొన్ని చోట్ల పోలీసులతో ఘర్షణకు దిగడంతో అధికారులు బాష్పవాయువు, నీటి ఫిరంగులను ప్రయోగించారు. విద్యావకాశాలు ఖరీదైనవిగా మారుతున్నాయన్న ఆందోళన యువతలో వ్యక్తమవుతోంది.

## పోర్చుగల్‌లో గృహ సంక్షోభం

పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో పెరుగుతున్న ఇళ్ల ధరలు, అద్దెలు, తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. దేశంలో గృహ సంక్షోభం తీవ్రతరమవడంతో సాధారణ కుటుంబాలు సొంతింటి సంగతి పక్కనపెట్టి అద్దె చెల్లించడం కూడా కష్టంగా మారుతోందని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుంచి ఇళ్ల కొనుగోలు ధరలు రెట్టింపునకు పైగా పెరగడం, కొత్త అద్దె ఒప్పందాలపై భారం అధికమవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. వేతనాలు పెరుగుతున్న ఖర్చులకు సరిపోవడం లేదని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి.

## ఇటలీలో ధరల సెగ.. వీధుల్లో ఘర్షణలు

ఇటలీలోని మిలన్, బొలోన్యా నగరాల్లో జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు కొన్ని చోట్ల ఘర్షణలకు దారితీశాయి. పెరుగుతున్న ధరలు, వేతనాలు, ఉపాధి పరిస్థితులు, కుటుంబ ఖర్చులపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది. నిరసనకారులు పోలీసులతో ఘర్షణ పడటంతో అధికారులు చర్యలు చేపట్టారు. ధరల పెరుగుదలతో సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుండటమే ఆందోళనలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది.

## అల్బేనియాలో ప్రభుత్వంపై ఒత్తిడి

అల్బేనియా రాజధాని తిరానాలో విద్యార్థుల నిరసనలు ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారాయి. అవినీతి ఆరోపణలు, విద్యా వ్యయం, ఉపాధి అవకాశాల కొరత, పెరుగుతున్న జీవన వ్యయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకారులు ప్రధాని ఎడి రామా రాజీనామాను డిమాండ్ చేస్తున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లో పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. బాష్పవాయువు, నీటి ఫిరంగుల ప్రయోగంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అయితే రాజీనామా చేసే ప్రసక్తే లేదని ప్రధాని స్పష్టం చేయడం రాజకీయ సంక్షోభాన్ని మరింత పెంచింది.

## అర్జెంటీనాలో విశ్వవిద్యాలయాల కోసం పోరు

అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో అధ్యక్షుడు జేవియర్ మిలీ ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు విధానాలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు నిధుల కొరతపై విద్యార్థులు, అధ్యాపకులు నిరసనకు దిగారు. విశ్వవిద్యాలయాలకు నిధులు పెంచాలని, ఆర్థిక వనరుల కేటాయింపునకు సంబంధించిన చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అక్టోబర్ 15న జరిగిన ప్రదర్శనల్లో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసులు బాష్పవాయువు, నీటి ఫిరంగులను ప్రయోగించారు. విద్య, పరిశోధన రంగాలకు నిధులు తగ్గించడం వల్ల భవిష్యత్తు అవకాశాలు దెబ్బతింటాయని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## అమెరికాలో 'నో కింగ్స్' నినాదం

అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను వ్యతిరేకించే 'నో కింగ్స్' ఉద్యమం మరోసారి తెరపైకి వచ్చింది. అక్టోబర్ 17న దేశంలోని పలు నగరాల్లో జరిగిన ప్రదర్శనల్లో పాల్గొన్నవారు ప్రజాస్వామ్య విలువలు, ప్రభుత్వ అధికారాలపై నియంత్రణ, ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో ముందుగానే ఓటు వేయాలని ఉద్యమ నిర్వాహకులు పిలుపునిచ్చారు. ట్రంప్ పాలనపై అసంతృప్తిని ఎన్నికల ద్వారా వ్యక్తం చేయాలన్నది ఈసారి ప్రదర్శనల్లో ప్రధాన సందేశంగా నిలిచింది.

## ఒకే కారణం కాదు.. అసంతృప్తి మాత్రం ఒక్కటే!

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఆందోళనలన్నీ ఒకే ఉద్యమంలో భాగం కాకపోయినా.. వాటి వెనుక ఉన్న సమస్యల్లో కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ధరలు, అందుబాటులో లేని గృహాలు, విద్యారంగంపై ఒత్తిడి, తగిన వేతనాలు లేకపోవడం, ఉపాధిపై అనిశ్చితి ప్రజలను ప్రభుత్వాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి.

కొన్ని దేశాల్లో నిరసనలు శాంతియుతంగా సాగుతుండగా, మరికొన్ని చోట్ల హింసాత్మకంగా మారుతున్నాయి. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపడంతో పాటు శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించడం ప్రభుత్వాల ముందున్న కీలక సవాలుగా మారింది.

# కర్నూలు మేయర్ పీఠం కోసం అత్తాకోడళ్ల పోటీ..

**కర్నూలు, వెలుతురు అక్టోబరు 19:**

కర్నూలు రాజకీయాల్లో ఆసక్తికరమైన పోరు తెరపైకి వచ్చింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగుతున్న ఇద్దరు మహిళల మధ్య ఉన్న కుటుంబ సంబంధాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఒకరు తెలుగుదేశం పార్టీ తరపున విజయ ప్రత్యూష కాగా, మరొకరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సుశీల. బంధుత్వం ఒకవైపు.. రాజకీయ ప్రత్యర్థిత్వం మరోవైపు అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారం స్థానికంగా ఆసక్తిని పెంచుతోంది.సాధారణంగా ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య విమర్శలు, పోటీ సహజమే. అయితే ఒకే కుటుంబానికి చెందినవారు వేర్వేరు పార్టీల తరఫున కీలక పదవుల కోసం పోటీ పడితే ఆ రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారతాయి. కర్నూలు మేయర్ పదవికి సంబంధించి ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కుటుంబంలో అత్తాకోడళ్ల వరుసలో ఉన్న ఇద్దరు మహిళలు రాజకీయంగా ఒకరికొకరు ఎదురుగా నిలవడం ఈ పోటీకి ప్రత్యేకతను తీసుకొచ్చింది.తెలుగుదేశం పార్టీ తరఫున ముందుకు వస్తున్న బొల్లెద్దుల విజయ ప్రత్యూషకు గతంలో 52వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఆమె టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణ కుమార్తె. స్థానిక రాజకీయాలపై అవగాహన, గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం తనకు అనుకూలంగా మారుతాయని ఆమె వర్గం భావిస్తోంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మద్దతు, పార్టీ అధిష్ఠానం ఆశీస్సులు కూడా తన రాజకీయ ప్రయాణానికి బలాన్నిస్తాయని విజయ ప్రత్యూష అనుచరులు ఆశిస్తున్నారు.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సుశీల పేరు చర్చలో ఉంది. ఆమెకు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ కుటుంబంతో సంబంధాలు ఉండటంతో పాటు, పార్టీ శ్రేణుల మద్దతు తనకు కలిసివస్తుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా పార్టీకి ఉన్న బలం, నాయకుల సహకారం మేయర్ పదవిని దక్కించుకునే ప్రయత్నంలో కీలకంగా మారవచ్చు. దీంతో ఇరువర్గాల మధ్య పోటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ఇద్దరి మధ్య ఉన్న బంధుత్వమే ఈ వ్యవహారంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సుశీల కుమారుడిని విజయ ప్రత్యూష సోదరి వివాహం చేసుకుంది. ఈ సంబంధం కారణంగా వీరిద్దరూ అత్తాకోడళ్ల వరుసలోకి వస్తారు. కుటుంబ వేడుకల్లో కలుసుకునే వీరు రాజకీయ వేదికపై ప్రత్యర్థులుగా నిలవాల్సిన పరిస్థితి రావడం స్థానికంగా చర్చలకు దారితీస్తోంది.అయితే మేయర్ పదవిని ఎవరు దక్కించుకుంటారనేది కేవలం కుటుంబ నేపథ్యం లేదా వ్యక్తిగత పరిచయాలపై ఆధారపడి ఉండదు. పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు, రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సమీకరణాలు వంటి అనేక అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి.





## టీడీపీ నుంచి ప్రత్యూష.. వైసీపీ నుంచి సుశీల

కర్నూలు మేయర్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో టీడీపీ తరఫున బొల్లెద్దుల ప్రత్యూష, వైసీపీ తరఫున ఉతకల్ల సుశీల పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నప్పటికీ, కుటుంబపరంగా దగ్గరి సంబంధం ఉంది. ప్రత్యూష సోదరి ప్రియాంకను సుశీల కుమారుడు భార్గవ్ వివాహం చేసుకున్నారు. ఈ బంధం కారణంగా సుశీల, ప్రత్యూషకు అత్త అవుతారు. ఇప్పుడు ఒకే కుటుంబానికి చెందిన ఈ ఇద్దరు మహిళలు మేయర్ పీఠం కోసం పోటీ పడుతుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది.ఉతకల్ల సుశీల కుటుంబానికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె భర్త మణి గాంధీ గతంలో కోడుమూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. సుశీల మామ శిఖామణి కూడా కోడుమూరు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో సుశీలకు రాజకీయ కుటుంబ నేపథ్యం బలంగా ఉంది.మరోవైపు, బొల్లెద్దుల ప్రత్యూష కూడా రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకురాలే. కర్నూలు 51వ డివిజన్ నుంచి గత ఐదేళ్లపాటు కార్పొరేటర్‌గా పనిచేశారు. ఆమె తండ్రి రామకృష్ణ మంత్రి టీజీ భరత్‌కు అనుచరుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి మద్దతుతో ప్రత్యూషకు మేయర్ అభ్యర్థిగా అవకాశం లభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### అత్త గెలుస్తుందా? కోడలు విజయం సాధిస్తుందా?

ఒకవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ.. రెండు పార్టీల మధ్య పోటీకి కుటుంబ బంధం మరింత ఆసక్తిని జోడిస్తోంది. రాజకీయ అనుభవం, పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు వంటి అంశాలు ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. చివరకు అత్త సుశీల విజయం సాధిస్తారా? లేక కోడలు ప్రత్యూష మేయర్ పీఠాన్ని దక్కించుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. కర్నూలు మేయర్ ఎన్నికల ఫలితం కోసం రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. ప్రజా సమస్యలపై అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కూడా నాయకుల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయగలవు.కర్నూలు నగర ప్రజలకు ఈ పోటీ ఆసక్తికరంగా కనిపిస్తున్నప్పటికీ, చివరకు మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది రాజకీయ పరిణామాలపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబ బంధాలు ఎన్నికల పోటీని ఎంతవరకు ప్రభావితం చేస్తాయి? పార్టీ విధేయతకు ఓటర్లు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? ఈ ప్రశ్నలకు రాబోయే పరిణామాలు సమాధానం చెప్పనున్నాయి. అత్తాకోడళ్లుగా బంధుత్వం కలిగిన ఈ ఇద్దరు మహిళల రాజకీయ పోటీ కర్నూలు రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో వేచి చూడాలి.

# ఆక్వా రైతులకు షాక్..

**కర్నూలు, వెలుతురు అక్టోబరు 19:**

ఆంధ్ర ప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతులకు రొయ్యల మేత కంపెనీలు కోలుకోలేని షాక్ ఇచ్చా యి. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు సరిగ్గా లేక, పెట్టుబడులు రాక ఇబ్బంది పడుతున్న ఆక్వా రంగానికి ఈ మేత ధరల పెంపు ఒక పెద్ద శాపంగా మారింది. నిన్నటి నుంచే అమల్లోకి వచ్చిన ఈ కొత్త ధరల నిర్ణయం పట్ల జిల్లాలోని ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన మరియు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ తాజా ధరల పెంపు ప్రకారం, వనామీ రొయ్యల మేత కిలోపై ఏకంగా 9.35 రూపాయలు పెంచారు. దీంతో వనామీ మేత టన్ను ధర ఇప్పుడు ఏకంగా 1.20 లక్షల రూపాయలకు చేరుకుంది. అలాగే టైగర్ రొయ్యల మేత కిలోపై 12.87 రూపాయలు పెంచడంతో, దీని టన్ను ధర ఏకంగా 1.38 లక్షల రూపాయల రికార్డు స్థాయికి చేరింది. ఇలా అడ్డూఅదుపూ లేకుండా మేత ధరలు పెరగడం వల్ల ఎకరానికి అయ్యే పెట్టుబడి ఖర్చు ఊహించని విధంగా పెరిగిపోతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం మంది రైతులు వనామీ, టైగర్ రొయ్యల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ ఛార్జీలు, మందుల ఖర్చులు భారంగా మారిన తరుణంలో, ఇప్పుడు మేత ధరలు కూడా ఈ స్థాయిలో పెరగడంతో తాము కోలుకోలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఎలా ముందుకెళ్దాం..!!

## ప్రభుత్వ పథకాల ప్రచారంపై సీఎం, మధుయాష్కీ చర్చ

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సమాలోచన

### ఏఐపీసీ బలోపేతానికి సహకరిస్తానన్న రేవంత్ రెడ్డి

### నూతన విధానాల రూపకల్పనలో నిపుణుల భాగస్వామ్యంపై చర్చ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19**

అఖిల భారత వృత్తి నిపుణుల కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కీకి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురి మధ్య సుమారు గంటన్నర పాటు సమావేశం కొనసాగింది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫీజుల తిరిగి చెల్లింపు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో చేసినట్లు పేర్కొంటున్న సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులపై వడ్డీ భారం తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.

### సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి త్వరలో మూడేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరంపై ఇరువురూ చర్చించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్, సబ్సిడీ ధరకు గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ వంటి పథకాల గురించి ప్రజలకు వివరించాలని అభిప్రాయపడ్డారు.

అలాగే ప్రతి నియోజకవర్గంలో సమీకృత పాఠశాలల ఏర్పాటు, నైపుణ్య విశ్వవిద్యాలయం ద్వారా ఉపాధి అవకాశాల కల్పన, భవిష్యత్ నగర నిర్మాణంతో కొత్త కంపెనీలను ఆకర్షించి లక్షలాది మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చర్చించారు. సంక్షేమ పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. ఇతర సంస్థలు, కార్యక్రమాల పనితీరును సమీక్షించి పురోగతి నివేదికలు తీసుకుంటున్న తరహాలోనే ప్రభుత్వ శాఖలు, పథకాల అమలుపైనా క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని చర్చకు వచ్చినట్లు తెలిసింది.

### ఏఐపీసీ బలోపేతానికి సహకారం

తెలంగాణలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు రాష్ట్రంలో అఖిల భారత వృత్తి నిపుణుల కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంపై సమావేశంలో చర్చించారు. సంస్థ బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సమాచారం.

వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై సమర్థవంతమైన చర్చలకు ఈ సంస్థను వేదికగా తీర్చిదిద్దే అంశాలనూ ప్రస్తావించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నిపుణుల ద్వారా సమగ్ర నివేదికలు రూపొందించే అవకాశాలపై చర్చించారు.

### విధానాల రూపకల్పనలో నిపుణుల భాగస్వామ్యం

నిపుణుల సేవలను ప్రభుత్వం, పార్టీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా నూతన విధానాలు, ప్రజోపయోగ కార్యక్రమాల రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని పెంచవచ్చని రేవంత్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్ అభిప్రాయపడినట్లు సమాచారం. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగినవారి సూచనలు, సలహాలతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సమావేశంలో చర్చించారు.



## సింగరేణి అధికారులకు దసరా కానుక

- అధికారుల విజ్ఞప్తిని నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కోలిండియా తరహా వేతనాల పెంపునకు సింగరేణి ఉత్తర్వులు జారీ
- ఎగ్జిక్యూటివ్ క్యాడర్-1 నుంచి 7 వరకు సుమారు 1,800 మందికి ప్రయోజనం
- సెప్టెంబర్ 25 వ తేదీ నుంచి ఆర్థిక ప్రయోజనాలు వర్తింపు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

సింగరేణి అధికారుల చిరకాల విజ్ఞప్తిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నెరవేరింది. కోలిండియా తరహా వేతనాలను అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్-1 నుంచి ఎగ్జిక్యూటివ్ క్యాడర్-7 వరకు ఉన్న సుమారు 1,800 మంది అధికారులకు ప్రయోజనం చేకూరనుంది.

సవరించిన బేసిక్ వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయి. అయితే, ఆర్థిక ప్రయోజనాలు సింగరేణి బోర్డు ఆమోదం తెలిపిన సెప్టెంబర్ 25, 2026 నుంచి వర్తిస్తాయి. ఈ పెరిగిన వేతనాలను అక్టోబరు నెల జీతాల నుంచి చెల్లించనున్నారు. సవరించిన వేతనాల అమలుకు సంబంధించి సంస్థ డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

కోలిండియాలో వేతన అసమానతల నేపథ్యంలో, మహారత్న సంస్థల వేతన విధానాన్ని తమకు అమలు చేయాలని కోలిండియా అధికారులు కోరారు. ఆ ప్రతిపాదనకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోలిండియా యాజమాన్యం ఆమోదం తెలిపాయి. అదే విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేయాలని సంస్థ అధికారులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన భట్టి విక్రమార్క దసరాలోపు అధికారులకు శుభవార్త అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ఏడాది జులైలో సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం ఈ అంశంపై సింగరేణి యాజమాన్యం కమిటీని ఏర్పాటు చేసి, దాని నివేదిక ఆధారంగా బోర్డు ఆమోదంతో వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నారు.

తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, ఇచ్చిన హామీని నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారుల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం మరింత అంకితభావంతో బొగ్గు ఉత్పత్తి చేసి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతామని పేర్కొన్నారు.

### ఇటీవలే కార్మికులకు 596 కోట్ల బోనస్...

ఇటీవలే దసరా సందర్భంగా సింగరేణిలోని దాదాపు 39 వేల మంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం తీపి కబురుగా 596 కోట్ల రూపాయల బోనస్ అందించిన విషయం తెలిసిందే. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి లోని కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వారికి రూ.5,500 చొప్పున బోనస్‌ను ప్రకటించారు. తాజాగా అధికారులకు వేతన సవరణపై ఉత్తర్వులు వెలువడటం విశేషం.

**కొత్త వేతనాల ప్రకారం అధికారుల బేసిక్ వేతనాలు ఇలా ఉంటాయి:**

| క్యాడర్ | పాత బేసిక్ | కొత్త బేసిక్ వేతనం |
|---|---|---|
| జు-1 | రూ.40,000 | రూ.60,000 |
| జు-2 | రూ.50,000 | రూ.70,000 |
| జు-3 | రూ.60,000 | రూ.80,000 |
| జు-4 | రూ.70,000 | రూ.90,000 |
| జు-5 | రూ.80,000 | రూ.1,00,000 |
| జు-6 | రూ.90,000 | రూ.1,20,000 |
| జు-7 | రూ.1,00,000 | రూ.1,20,000 |

## రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 19:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని మంత్రి పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో దసరా పండుగను జరుపుకోవాలని, ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో అభివృద్ధి, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు కలగాలని కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## డీజీపీ కార్యాలయంలో ఘనంగా దుర్గాపూజ, ఆయుధపూజ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:** హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాల యంలో సోమవారం దుర్గాపూజ, ఆయుధ పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించా రు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాపూజ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. అనంతరం ఆయుధపూజలో భాగంగా పోలీసు శాఖలో విధులు నిర్వహించేందుకు వినియోగించే ఆయుధాలు, ఇతర పరికరాలకు పూజలు నిర్వహించారు. పోలీసు శాఖలో ఆయుధపూజకు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీజీ మహేష్ భగవత్, ఏఐజీ అడ్మిన్ రమణ కుమార్, స్టోర్స్ డీఎస్పీ, సీఏఓతో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పండుగ సంప్రదా యాలను గౌరవిస్తూ, విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజల రక్షణ పట్ల అంకితభావాన్ని చాటేలా ఈ కార్యక్రమం నిర్వహించారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో వేగం పెంచాలి

- ఆర్థిక సంస్కరణలు, వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై ప్రత్యేక దృష్టి
- నిధుల వినియోగ పురోగతిపై శాఖల వారీగా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడానికి వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ ప్రోగ్రెస్ సబ్‌ప్లాన్ అమలు, శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. కేటాయించిన నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చయ్యేలా సంబంధిత శాఖలు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కేటాయించిన నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమర్థవంతంగా ఉపయోగపడేలా శాఖలవారీగా వ్యయ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. చట్ట నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా సాధారణ పద్దుల తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పద్దుల కింద కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిధుల ఖర్చులో ఉన్న అంతరాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలతో ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించి, ఖర్చుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ మేరకు ముందుగా ఖర్చులో ఎక్కువ గ్యాప్ ఉన్న మొదటి ఐదు శాఖలు వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ, తరువాత క్రమంలో ఇతర శాఖల కార్యదర్శులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి, నివేదిక రూపొందించాలని సూచించారు.

### ఆర్థిక సంస్కరణలతో ఆదాయ వనరుల పెంపు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు, అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ, వ్యయ నియంత్రణ, నిధుల సద్వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్థిక శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణకు చేపడుతున్న చర్యలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### నిపుణుల సలహాలతో మెరుగైన ఆర్థిక నిర్వహణ

ఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, ఆర్థిక రంగ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమానికి కేటాయించిన నిధులు అర్హులైన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగం కావడంతోపాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ అవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్‌తో పాటు ఇతర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచాలి

- కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలివ్వాలి : హరీశ్ రావు



**సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 19:**

సిద్దిపేటకు జాతీయ స్థాయిలో స్వచ్ఛత అవార్డులు రావడం వెనుక పారిశుద్ధ్య కార్మికుల రెక్కల కష్టమే ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. దసరా సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి టిఫిన్ చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన సొంత ఖర్చులతో మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందజేసి సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పాలనలో రూ.8,300గా ఉన్న కార్మికుల జీతాలను కేసీఆర్ హయాంలో రూ. 16,600కు పెంచామని తెలిపారు. కాంట్రాక్టర్లు, మధ్యవర్తుల దోపిడీని అరికట్టి, గ్రూపుల ద్వారా నేరుగా కార్మికుల ఖాతాల్లో జీతాలు జమయ్యేలా చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని విమర్శించారు. నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, బస్సు ఛార్జీలు పెరగడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సిద్దిపేటలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, స్వీపింగ్ యంత్రాలు, ఇంటింటికీ చెత్త సేకరణ ఆటోలతో కార్మికుల శ్రమను తగ్గించామని చెప్పారు. మల్లన్నసాగర్ ద్వారా గురుత్వాకర్షణతో నీటి సరఫరా జరుగుతుండటంతో నల్లా ఆపరేటర్ల కష్టాలు తగ్గాయన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని కొనియాడారు. నల్లా ఆపరేటర్లు, మొక్కలు నాటే కార్మికులకు కూడా గ్రూపు విధానం అమలు చేసి నేరుగా జీతాలు చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. ఈ అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించి కార్మికులకు న్యాయం జరిగేలా పోరాడతానని హామీ ఇచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను ప్రభుత్వం తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు.

## 14 నెలల ఆహార భద్రతకు ప్రణాళిక

- ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత
- రేషన్ ద్వారా గోధుమపిండి సహా నిత్యావసరాల పంపిణీపై పరిశీలన
- పౌరసరఫరాల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 19:**

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావం, పంట నష్టాలు, ఆహార ధరల పెరుగుదలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు భరోసా కల్పించేందుకు 14 నెలల వరకు అవసరాలను తీర్చేలా ఆహార ధాన్యాల నిల్వలను బలోపేతం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాబోయే వ్యవసాయ సీజన్లలో వర్షపాతం తగ్గినా రేషన్ సరఫరాలకు అంతరాయం కలగకుండా ధాన్యం సేకరణ, బియ్యం నిల్వల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రానున్న వరి పంట దిగుబడిపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం కింద మధ్యాహ్న భోజనం తదితర అవసరాలకు కలిపి నెలకు సుమారు 2.38 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని మంత్రి తెలిపారు.

ఈ లెక్కన వార్షిక అవసరం 28.56 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. 2026 అక్టోబర్ 16 నాటికి రాష్ట్రంలోని బఫర్ గోదాముల్లో 9.64 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇందులో కేంద్ర పూల్, ఇతర సంక్షేమ పథకాల కింద 3.50 లక్షల మెట్రిక్ టన్నులు, రాష్ట్ర పూల్ కింద 6.14 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్), ఇతర గుర్తించిన సరఫరాల ద్వారా మరో 18.39 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందాల్సి ఉందన్నారు. ప్రస్తుత నిల్వలు, అందాల్సిన బియ్యం కలిపితే మొత్తం లభ్యత 28.03 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ పరిమాణం ప్రజాపంపిణీ, ఇతర సంక్షేమ పథకాల అవసరాలకు సుమారు 11.7 నెలలపాటు, అంటే 2027 సెప్టెంబర్ వరకు సరిపోతుందని వివరించారు. మిల్లర్లు, ఇతర వనరుల నుంచి రావాల్సిన బియ్యం నిర్ణీత గడువులోగా ప్రభుత్వ గోదాములకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

### నిత్యావసరాల పంపిణీపై కసరత్తు

ధరల పెరుగుదల వల్ల పేద కుటుంబాలపై పడే భారాన్ని తగ్గించేందుకు రేషన్ వ్యవస్థ ద్వారా గోధుమపిండితోపాటు ఎంపిక చేసిన నిత్యావసర వస్తువులను అందించే అవకాశాన్ని మంత్రి పరిశీలించారు. గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి తదితర వస్తువుల పంపిణీ అంశం సమీక్షలో చర్చకు వచ్చింది. సబ్సిడీ ధరలకు అందించడంతోపాటు వివిధ పంపిణీ విధానాలకు సంబంధించిన వ్యయ అంచనాలను అధికారులు సమర్పించారు. లబ్ధిదారులకు అందించాల్సిన పరిమాణాలు, సరుకుల సేకరణ ఏర్పాట్లు, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని సమగ్రంగా లెక్కించాలని మంత్రి సూచించారు. సమీక్షలో పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, MdI.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com